నేటి కందం-నేటికి అందం

స్వాతంత్ర్యము కావలయును !
స్వాతంత్ర్యము జన్మహక్కు జను లందిరికిన్ !!
స్వాతంత్ర్య శుభాశయమును
స్వాతంత్ర్య దినోత్సవమున జాతి కొసగెదన్ !!

(అందరికీ స్వాతంత్ర్య
దినోత్సవ శుభాకాంక్షలు)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

చురక

ప్రజాస్వామ్య పతాక
పార్లమెంటు రచ్చ రచ్చ
చర్చలేవి లేకుండానే
సభల సాగు ఒక మచ్చ.
ప్రశ్నలకు బదులిచ్చుడు
ప్రభుత్వానికిది బాధ్యత
దాటవేస్తే తప్పించుక
దేశమంతా ఒక చోద్యత.

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ శనివారం 15-8-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:9 పేజీలు:6 వెల: రూ.1/-


## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహణకు కేబినెట్ నిర్ణయం

హైదరాబాద్, ఆగస్టు 14: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఈరోజు (శుక్రవారం) రాష్ట్ర సచివాలయంలో కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మంత్రి మండలి పలు నిర్ణయాలు తీసుకుంది. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఈ సదస్సు నిర్వహించనుంది.

ఈ సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను కేబినెట్ ఏర్పాటు చేయనుంది. గత ఏడాది కంటే ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో ఈ సదస్సు నిర్వహించనుంది. ఫ్యూచర్ సిటీ ప్లాన్‌ను ప్రజలకు వివరించనుంది. తెలంగాణలో డిఫెన్స్, ఏరో స్పేస్, ఫార్మాతో పాటు వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా సదస్సు నిర్వహించనుంది. వివిధ రంగాల్లో తెలంగాణ స్టార్టప్, పరిశ్రమలు సాధించిన విజయాలు.. వివిధ రంగాల కొత్త ఆవిష్కరణల ప్రదర్శన ఏర్పాటు చేయాలని మంత్రులు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

## జనగణన-2027పై కేంద్రం కీలక నోటిఫికేషన్.. తొలిసారిగా సమగ్ర కుల గణన

న్యూఢిల్లీ, ఆగస్టు 14: దేశవ్యాప్తంగా చేపట్టనున్న 'జనగణన-2027'పై కేంద్ర హోంశాఖ కీలక నోటిఫికేషన్ విడుదల చేసింది. స్వాతంత్ర్యం అనంతరం తొలిసారిగా సమగ్ర కుల గణన చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. జనగణనలో పౌరులను అడిగే 40 ప్రశ్నలతో కూడిన జాబితాను రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా నోటిఫై చేసింది. జనగణన ప్రశ్నావళిలోని 10వ ప్రశ్నగా ఎస్సీ, ఎస్టీ, కులానికి సంబంధించిన వివరాలను నమోదు చేసేందుకు ప్రత్యేక అవకాశం కల్పించారు.

దేశంలోనే తొలిసారిగా యాప్‌లు, డిజిటల్ సాధనాల ద్వారా జనాభా లెక్కల సేకరణ చేపట్టనున్నారు. 15 రోజుల పాటు స్వయంగా వివరాలను నమోదు చేసుకునే అవకాశాన్ని కల్పించనున్నారు. రూ.11,718.24 కోట్ల అంచనా వ్యయంతో జనగణన-2027ను రెండు దశల్లో నిర్వహించనున్నారు. తొలి దశలో 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య గృహాల నమోదు, వసతులకు సంబంధించిన వివరాల సేకరణ చేపట్టనున్నారు.

రెండో దశలో 2027 ఫిబ్రవరిలో జనాభా, విద్య, ఉపాధి, కులానికి సంబంధించిన వివరాల సేకరణ ప్రక్రియను పూర్తి చేయనున్నారు. జనగణనలో పౌరులు అందించే వ్యక్తిగత వివరాలకు చట్టపరమైన రక్షణ కల్పించారు. సెన్సస్ యాక్ట్, 1948లోని సెక్షన్ 15 ప్రకారం పౌరుల వ్యక్తిగత సమాచారానికి పూర్తి చట్టబద్ధ రహస్య రక్షణ ఉంటుంది.

## జిల్లా కేంద్ర గ్రంథాలయానికి ఎఫ్‌సీఐ ఏజీఎం డాక్టర్ రాఘువేంద్ర సింగ్ పుస్తకాలు విరాళం



నల్గొండ, ఆగస్టు 14: ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ డాక్టర్ రాఘవేంద్ర సింగ్ నల్లగొండలోని జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రంథాలయ నిర్వహణను, అక్కడ అందుతున్న సేవలను పరిశీలించి నిర్వాహకులను అభినందించారు. గ్రంథాలయానికి విచ్చేసిన పాఠకులు, పోటీ పరీక్షల అభ్యర్థుల అవసరాలను గుర్తించిన డాక్టర్ రాఘవేంద్ర సింగ్ వారికి అత్యంత ఉపయోగకరమైన పలు పుస్తకాలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్‌లోనూ గ్రంథాలయ అభివృద్ధికి, పాఠకులకు అవసరమైన అన్ని రకాల పుస్తకాలను సమకూర్చడంలో తనవంతు సహాయ సహకారాలను అందిస్తానని హామీ ఇచ్చారు. డాక్టర్ రాఘవేంద్ర సింగ్ ను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి. బాలమ్మ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

## తిరంగా సగర్వంగా ఎగరంగా.. జూలూరుపాడులో 1,200 మీటర్ల భారీ జాతీయ జెండాతో ర్యాలీ

ఖమ్మం, ఆగస్టు 14:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల కేంద్రం దేశభక్తి భావనతో పులకించిపోయింది. జాతీయ సమైక్యతను చాటిచెబుతూ స్థానిక 'ఆరోగ్య జీవనయాత్ర వాకింగ్ క్లబ్' బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన 1,200 మీటర్ల భారీ తిరంగా ర్యాలీ స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. స్థానిక సాయిబాబా దేవాలయం వద్ద అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమైన ఈ మహా ప్రదర్శన, పోలీస్ స్టేషన్ వరకు ప్రధాన రహదారి గుండా అట్టహాసంగా సాగింది. వందల సంఖ్యలో చేతులు ఆ భారీ త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా ముందుకు నడిపిస్తుంటే జూలూరుపాడు పురవీధులన్నీ దేశభక్తి శోభతో వెల్లివిరిశాయి.

ర్యాలీ సాగుతున్నంత సేపు యువత, విద్యార్థులు చేసిన "భారత్ మాతా కీ జై", "వందేమాతరం" నినాదాలతో పరిసరాలు మారుమోగాయి. అనంతరం చంద్రుగొండ రోడ్డు కూడలి వద్ద భారీ ఎత్తున మానవహారం నిర్వహించి, దేశ ఐక్యతకు కట్టుబడి ఉంటామని ప్రతినబూనారు. వ్యాపారస్తులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా తరలివచ్చి ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఒకే తాటిపై నడిచి ఇంతటి మహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## సెప్టెంబర్ తొలి వారంలోనే గోదావరి పుష్కర పనులు ప్రారంభించాలి

### -ఆగస్టు చివరి నాటికి టెండర్లు పూర్తి చేయాలి.. నాణ్యతలో రాజీ వద్దు: మంత్రి శ్రీధర్‌బాబు



మంథని, ఆగస్టు 14: గోదావరి పుష్కరాలు-2027 నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ సెప్టెంబర్ మొదటి వారంలో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించిన టెండర్ ప్రక్రియను ఆగస్టు చివరి నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో శుక్రవారం ఆయన అధ్యక్షతన జరిగిన 'గోదావరి పుష్కరాలు-2027' కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వివేక్ వెంకట స్వామి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాఖలవారీగా సన్నద్ధత, ఏర్పాట్ల పురోగతిని సమీక్షించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. పుష్కరాల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లు కేటాయించిందని మంత్రి తెలిపారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే టైర్-1 ప్రాంతాలకు ప్రత్యేక అధికారులను నియమించాలని, ముఖ్యమైన ప్రాంతాల్లో కమాండ్ కంట్రోల్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు.

నిర్దేశిత గడువులోగా పనులు పూర్తయ్యేలా ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని, అయితే నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడవద్దని శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. పనుల పురోగతిని అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, రోజువారీ పురోగతిని తెలుసుకునేలా ప్రత్యేక డ్యాష్‌బోర్డును అందుబాటులోకి తీసుకురావాలని దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసినప్పుడే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పుష్కరాలను విజయవంతంగా నిర్వహించగలమన్నారు. భక్తుల రవాణాకు అంతరాయం లేకుండా ప్రతి రహదారిని అనుసంధానించాలని, ఎక్కడైనా రహదారి అనుసంధానం లోపిస్తే వెంటనే గుర్తించి స్థానిక నిధులతో పనులు చేపట్టాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా ఉన్నతాధికారులు, పండితులను ఏర్పాట్లలో భాగస్వాములను చేయాలని, భక్తులకు సేవలు అందించేందుకు ముందుకొచ్చే స్వచ్ఛంద, ప్రైవేటు సంస్థలను ముందుగానే గుర్తించాలని తెలిపారు. కేబినెట్ సబ్ కమిటీ సభ్యుల సూచనలను పరిగణనలోకి తీసుకుని చర్యలు చేపట్టాలని, పుష్కరాల ఏర్పాట్లలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు.

## పుత్తూరులో విషాదం

తిరుపతి, ఆగస్టు 14:తిరుపతి జిల్లా పుత్తూరులో తీవ్ర విషాద ఘటన చోటుచేసుకుంది. ఉత్సవాల సందర్భంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ తీగలు తగిలి ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

పుత్తూరులోని ద్రౌపతమ్మ-ధర్మరాజుల ఉత్సవాల సందర్భంగా కె.ఎన్. రోడ్డులోని పూజా టెక్స్‌టైల్స్ వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేసేందుకు కొంతమంది విద్యార్థులు వెళ్లారు. ఫ్లెక్సీ కడుతున్న సమయంలో అది సమీపంలో ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలకు తగలడంతో ఒక్కసారిగా విద్యుదాఘాతం సంభవించింది.

ఈ ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతులను విగ్నేష్ (19), గోకుల్ (18)గా గుర్తించారు.

మృతులు స్థానిక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి గల కారణాలను పరిశీలిస్తున్నారు. ఇద్దరు కుమారులను కోల్పోయిన విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఉత్సవాల వేళ జరిగిన ఈ విషాదంతో పుత్తూరు ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## విద్యార్థులకు జాతీయ జెండాల పంపిణీ



రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 14:(నేటినిజం ప్రతినిధి): తిరంగా కార్యక్రమంలో భాగంగా వేములవాడ గౌతమ్ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉందన్నారు. కుల, మత, జాతి భేదాలకు అతీతంగా ప్రతి భారతీయుడు జాతీయ జెండాను గౌరవించాలని పిలుపునిచ్చారు.స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా తెలంగాణకు విమోచనం ఆలస్యంగా జరగడం బాధాకరమని ఆయన గుర్తుచేశారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని కోరారు.అంతకుముందు జిల్లా కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి ఆధ్వర్యంలో నిర్వహించిన తిరంగా ర్యాలీకి వేములవాడ నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, కౌన్సిలర్ కుమ్మరి శంకర్, కొండ్లెపు ముత్యం, వంగల శీను, మైలారం శ్రీను, సిరికొండ శ్రీనివాస్, రేగుల సంతోష్‌బాబు, రేగుల శ్రీకాంత్, మామిళ్ల లక్ష్మీరాజ్యం, పిన్నింటి హనుమన్లు, బిల్ల కృష్ణారి, గుడిసె మనోజ్, కటకం శ్రీనివాస్, వివేక్‌రెడ్డి, డాక్టర్ వెంకన్న, నామాల శేఖర్, పల్లెపు లక్ష్మణ్, జగన్నాథం శీను, సాయికృష్ణ, హరీష్ తదితరులు పాల్గొన్నారు

## జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలు ఆవిష్కరించిన సీఎం రేవంత్..

హైదరాబాద్, ఆగస్టు 14: మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. భాగ్య నగరంలోని నెక్లెస్ రోడ్డులో ఏర్పాటు చేసిన విగ్రహాలను ఆయన ఇవాళ (శుక్రవారం) ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్, మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, కొండ సురేఖ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, ఆర్.కృష్ణయ్య, సురేశ్ షెట్కర్, ఎమ్మె?ల్యేలు దానం నాగేందర్, నవీన్ యాదవ్, మందుల సామేల్, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంత రావు, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

## నేరాల స్వరూపం ఎప్పటికప్పుడు మారుతోంది: డీజీపీ ఆనంద్

హైదరాబాద్, ఆగస్టు 14: నేరాల స్వరూపం ఎప్పటికప్పుడు మారుతోందని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వ్యాఖ్యానించారు. సైబర్ నేరాల బారినపడుతున్న వారిలో రిటైర్డ్ ఉద్యోగులే ఎక్కువగా ఉంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో ఈరోజు (శుక్రవారం) నిర్వహించిన సురక్ష కా తిరంగా సైబర్ అవేర్‌నెస్ కార్యక్రమంలో డీజీపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

వారు ఫిర్యాదు చేయడానికి కూడా వెనకాడుతున్నారు..

సురక్ష కా తిరంగా కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్‌ను భాగస్వామ్యం చేస్తూ అవగాహన కల్పిస్తున్నామని డీజీపీ తెలిపారు. కొన్నేళ్ల క్రితం వరకు ఫిజికల్ దోపిడీలు జరిగేవని.. కానీ ఇప్పుడు నార్కోటిక్, సైబర్ నేరాలు పెరిగాయని వెల్లడించారు. నార్కోటిక్స్ బారినపడి విద్యార్థులు, యువకులు తమ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. సైబర్ నేరాల బారినపడుతున్న వారు.. ఫిర్యాదు చేయడానికి కూడా వెనకాడుతున్నారని చెప్పుకొచ్చారు.

ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్ ఎక్కువ..

సైబర్ నేరాల బారినపడుతున్న వారు.. ఎవరు ఏం అనుకుంటారోనని బయటకు కూడా చెప్పుకోవడం లేదని డీజీపీ అన్నారు. తాము 40 రకాల సైబర్ నేరాలను గుర్తించామని తెలిపారు. ఇందులో ఎక్కువగా ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్ ఉంటున్నాయని వివరించారు. తాము ఎంత అడ్డుకట్ట వేస్తున్నా.. సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ కొత్తగా సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

## ప్రభుత్వ ఐటీఐ కళాశాలను అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



ములుగు, ఆగస్టు 14:(నేటినిజం ప్రతినిధి) ములుగు రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల నూతన భవన నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం రూ.25 కోట్ల నిధులు మంజూరు చేయడం పట్ల వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. 50 సంవత్సరాలుగా వేలాది మంది విద్యార్థులకు సాంకేతిక విద్యనందించిన ఈ ఐటీఐకి నూతన భవనం అవసరం ఎంతో ఉందన్నారు.

వరంగల్‌లో నిరుద్యోగ యువతకు మెరుగైన ఉద్యోగావకాశాలు కల్పించాలంటే పరిశ్రమలు, రైల్వేలు, ఇతర సంస్థల్లో అవసరమైన నైపుణ్యాలకు అనుగుణంగా శిక్షణ అందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ అజీజ్‌ఖాన్, మాజీ కార్పొరేటర్లు విజయలక్ష్మి సురేందర్, జక్కుల రవీందర్, బోడ డిన్నా, డివిజన్ అధ్యక్షులు సంగీత్, నాయకులు అంబేద్కర్ రాజు, గోల్కొండ సాంబయ్య, సృజన్, క్రాంతి పాల్గొన్నారు


10 దశమ వార్షికోత్సవ సభ
ఆగస్టు 16, 2026
ఉదయం 10-00 గంటలకు

అమరావతి సాహితీ మిత్రులు

దశమ వార్షికోత్సవ

ఆగస్టు 16న ఉదయం 10 గంటలకు
గుంటూరు బ్రాడీపేట తాలూకా ఆఫీసులోని పెన్షనర్ల సమావేశ మందిరం...
డా. పాపినేని శివశంకర్, డా. జి. వి. పూర్ణచంద్, డా. చుండూరు మాణిక్యరావు,
డా. గుమ్మా సాంబశివరావు, శ్రీ బంగారు వి బి ఆచార్యులు, డా. జెల్ది విద్యాధరరావు,
డా. వెలువోలు నాగరాజ్య లక్ష్మి, డా. టి. సేవ కుమార్, "నేటి నిజం" సంపాదకులు
శ్రీ బైస దేవదాసు, "నవ మల్లె తీగ" సంపాదకులు కలిమిశ్రీ, శ్రీ గుత్తికొండ ధనుంజయరావు
మొదలైన వారు అతిథులుగా పాల్గొంటున్నారు. 16 మంది కవుల 20 పుస్తకాలు ఆవిష్కరిస్తారు.



అందరికీ ఆహ్వానం.
డా. రావి రంగారావు, అధ్యక్షులు, అమరావతి సాహితీ మిత్రులు.



# ఎనిమిది దశాబ్దాల స్వతంత్ర భారతంలో పేదరికాన్ని నిర్మూలించలేకపోయామా !

## (15 ఆగస్టు "భారత స్వాతంత్ర్య దినోత్సవం" సందర్భంగా)

వేద భూమి భారతం. ప్రపంచ మానవాళికి నాగరిక నేర్పిన దేశం భారతం. భిన్నత్వంలో ఏకత్వం సువిశాల భారతం. పురాణ ఇతిహాసాల పునాదులుగా నిర్మితమైంది భారతీయ జీవన తత్వం. అతి పెద్ద ప్రజాస్వామ్యానికి చిరునామా భారతం. 145 కోట్ల అత్యధిక జనాభా నా దేశ స్వంతం. శాంతి, సహనం,సౌభ్రాతృత్వం, సామరస్యాలకు నెలవు భారతం. సవాళ్లు ఎన్ని ఉన్నా స్థిరంగా నిలబడింది నా భరతమాత. ఆర్థిక ప్రగతి రథం పరుగులు పెడుతున్న వేళ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్టను పెంచుకుంటున్నది నా మాతృభూమి. సుస్థిరాభివృద్ధే లక్ష్యంగా ముందడు వేస్తున్న భారతాన్ని పేదరికం, నిరుద్యోగం, అధిక జనాభా, అసమానతలు, అవిద్య, అనారోగ్యం లాంటి పలు సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. గత 79 ఏండ్లుగా సుస్థిర అభివృద్ధిని సాధించినా నేటికీ ఆకలి చావులు, వైద్య ఆరోగ్య సమస్యలు, నిరక్షరాస్యత దేశానికి శాపంగా కొనసాగుతూనే ఉన్నాయి. అత్యధిక యువశక్తి కలిగిన భారతదేశం రేపటి ప్రపంచానికి దారి దీపంగా నిలవడానికి అవిరళ కృషి చేస్తున్నది.

### అంతర్జాతీయ దారిద్ర్య రేఖ:

ప్రపంచ పేదరిక అధ్యయనాల ప్రకారం, ప్రతి నిమిషానికి 44 మంది భారతీయులు పేదరిక కోరల్లోంచి బయట పడుతున్నట్లు తేలింది. గత రెండు దశాబ్దాలుగా దేశం రుచి చూస్తున్న సాంకేతిక విప్లవం, ఆర్థికాభివృద్ధి వల్ల పేదరికం 56 శాతం నుంచి 28 శాతానికి దిగువన చేరడం హర్షణీయం. దారిద్ర్య రేఖకు దిగువన 5.3 శాతం జనాభా ఉండగా పేదరికం మాత్రం 21.9 శాతం కన్న తక్కువగా నమోదు అవుతున్నది. ఒక వ్యక్తి గౌరవంగా జీవించడానికి అవసరమైన కూడు, గూడు, గుడ్డ లేని ప్రజలను పేదలుగా పిలుస్తున్నాం. ప్రపంచ బ్యాంక్ వివరణ ప్రకారం, కనీస ఆర్థిక వనరులు, విద్య, గౌరవం, ఆరోగ్య భద్రత, సురక్షిత తాగునీరు, పరిసరాలు పరిశుభ్రత, ఉద్యోగ ఉపాధులు లాంటివి లేని వారిని పేదలుగా గుర్తించడం జరుగుతోంది. ఒక వ్యక్తి రోజుకు 3.00 అమెరికన్ డాలర్ల కన్న తక్కువ ఖర్చు చేసినపుడు వారిని అంతర్జాతీయ దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నట్లు వర్గీకరించారు. నేటికీ నిరుద్యోగం వెంటపడి తరుముతున్నది. అవినీతిపరులు రాజ్యమేలుతున్నారు. మానవీయ విలువలు అనాథలు అయి పోతున్నాయి. పరీక్షల పేపర్ లీకులు యువత అసహనానికి కారణం అవుతున్నాయి. లంచగొండితనం విష కోరలు విప్పుతున్నారు. అభివృద్ధి నత్తనడకన సాగుతున్నది.

### పేదరికం ఓ బహువ్యాధి లక్షణం :

పేదరికం పెరిగితే అవిద్య, అశుభ్రత, అనారోగ్యం, ఆర్థిక అసమానతలు, పోషకాహార లోపం, ఆకలి చావులు, గృహవసతిలో కొరత, నిరుద్యోగం, బాలకార్మిక వ్యవస్థ లాంటి అవస్థలు పెరుగుతాయి. అనగా పేదరికం అనేది సమాజాన్ని పట్టి పీడించే బహువ్యాధి లక్షణంగా అర్థం చేసుకోవాలి. నీతి ఆయోగ్ వివరణ ప్రకారం, పట్టణ ప్రాంతాల్లో తలసరి నెలసరి కనీస వ్యయం రూ 1,407/-, గ్రామీణంలో తలసరి నెలసరి వ్యయం రూ 972/- కన్న తక్కువగా ఉన్నట్లైతే వారిని పేదలుగా వర్గీకరించడం జరుగుతుంది. టెన్‌డూల్కర్ కమిటీ అధ్యయనం ప్రకారం, ప్రతి పౌరుడు దినసరి రూ62/- కన్న తక్కువ ఖర్చు చేస్తే పేదలుగా గుర్తించాలి. పేదరికానికి ప్రధాన కారణాలుగా అధిక జనాభా, వ్యవసాయ ఉత్పత్తి తగ్గడం, వనరుల వినియోగంలో లోపం, ధరలు పెరగడం, నిరుద్యోగం, యువతలో నైపుణ్యాల కొరత, శ్రమ దోపిడీ, కాలం చెల్లిన సంప్రదాయాలు, పారిశ్రామిక ప్రగతి మందగించడం, అవినీతి, లింగ అసమానతలు, సామాజిక అవాంతరాలు, నిరక్షరాస్యత, కులమత విభేదాలు, రాక్షస రాజకీయాలు, ఓటు బ్యాంకు పాలనలు లాంటి పలు అంశాలు దోహదపడుతున్నాయి.

### భరతమాత ఎదుట సమాళ్లు – సమాధానాలు:

గరీబీ హటావో నినాదం కొనసాగుతూనే ఉన్నది. అవినీతి అక్రమాలు కోరలు చాస్తున్నాయి. రాజకీయాలు భ్రష్టు పట్టి పోయాయి. మానవ సంబంధాలు ధనం జపం చేసేతున్నాయి. న్యాయ దేవత కళ్లకు గంతలు కట్టబడి ఉన్నాయి. నీతి, న్యాయం అను మాటలు అసమర్థుల నినాదాలుగా పరిగణించబడుతూ ఎగతాళికి గురి అవుతున్నాయి. ప్రజాధనం అవినీతిపరుల జేబుల్లోకి ఏరులై పారుతోంది. పథకాలు ఎన్ని అమలు చేసినా ఫలితాలు పాతాళానికి పడిపోతున్నాయి. మనిషి మానవత్వాన్ని మరిచి రాక్షసత్వాన్ని నెత్తిన ఎత్తుకుంటున్నాడు. పేదరికానికి విరుగుడుగా రేపటి భవ్య భారత నిర్మాణానికి ఉచిత విద్య, అర్హతకు తగిన పని కల్పన, వైద్య ఆరోగ్య పసతుల కల్పన, గృహ వసతి, పరిసరాల పరిశుభ్రత, మౌలిక వనరుల కల్పన, పోషకాహార వినియోగం, లాభసాటి వ్యవసాయం, యువతకు నైపుణ్యాలతో కూడిన నాణ్యమైన విద్య, స్థానిక సంస్థల బలోపేతం, ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత, ఉద్యోగుల జవాబుదారీతనం, అవినీతి లంచగొండితనాలకు తరిమి వేయడం లాంటి బహుముఖీన చర్యలను అమలు చేయడం జరిగితే భారత సరిహద్దులు దాటి పేదరికం తరుమబడుతుంది.

అధిక యువ జనాభా భరతమాతకు మాత్రమే ప్రత్యేకం. మన యువత బాధ్యతగల నైపుణ్యతతో కూడి విద్యావంతులుగా ఎదిగి భరతమాత సేవలో పునీతులు కావాలి, మనం ఎదుగుతూ, దేశం పురోగమించే విధంగా ప్రగతి రథ చక్రాలకు ఇంధనాలుగా మారాలి. 2047 నాటికి వికసిత భారత్‌గా ప్రపంచ దేశాల ముందు సగర్వంగా నిలబడాలి.



-మధుపాళీ
9949700037

# భారతీయ సంప్రదాయాన్ని ముందుకు తీసుకెళుతున్న కళాకారులు మన ఉమ్మడి జ్ఞాపకాలకు సంరక్షకులు, మన భవిష్యత్తు దార్శనికతకు రూపకర్తలు: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

న్యూ ఢిల్లీ, ఆగష్టు 14:ప్రముఖ కళాకారులకు 2024, 2025 సంవత్సరాలకుగాను సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్‌లు, సంగీత నాటక అకాడమీ పురస్కారాలను రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపదీ ముర్ము ఈ రోజు (2026, ఆగష్టు 13) న్యూఢిల్లీలో ప్రదానం చేశారు. ఈ నేలకు చెందిన కథలు, పాటలతో భారత దేశ సాంస్కృతిక చిత్రాన్ని ఈ రోజు సత్కారం అందుకున్న కళాకారులు సమష్టిగా ఆవిష్కరిస్తున్నారని రాష్ట్రపతి అన్నారు. 'వైవిధ్యంతో నిండిన ఈ దేశానికి చెందిన నృత్యాలను, పండుగలను ఈ చిత్రం తనలో ఇముడ్చుకుంది. శతాబ్దాలుగా రూపుదిద్దుకున్న దాని భాషలు, మాండలీకాల జ్ఞాపకాలను తనలో దాచుకుంది. మనకు అనేక సంగీత సంప్రదాయాలు, నృత్య శైలులు, అనేక జానపద నాటక రూపాలు ఉన్నాయి' అని రాష్ట్రపతి చెప్పారు. భారతీయ సంస్కృతి ఈ నేలలో బలంగా వేళ్లూనుకుందన్నారు. 'వివిధ రకాల ఆహారాలు, సంప్రదాయాలు, వస్త్రధారణ, నృత్యరీతులు, సంగీతం అన్నీ ప్రకృతి నుంచి స్ఫూర్తి పొందినవే. కళాకారులు తమ నృత్యాన్ని, సంగీతాన్ని ప్రదర్శించడంలో పక్షుల కిలకిలారావాలు, గలగల పారే సెలయేళ్లు, చెట్లు, ఆకులు, మేఘాలు, నదుల నుంచి స్ఫూర్తి పొందుతారు. మన కళలకున్న గొప్ప సామర్థ్యాల్లో భిన్నత్వంలో ఏకత్వం కూడా ఒకటి' అన్నారు.

భారతదేశంలోని విభిన్న కళారూపాల్లో గురు-శిష్య పరంపర కీలకపాత్ర పోష రాష్ట్రపతి అన్నారు. 'మన కళలకు అత్యంత ముఖ్యమైన గ్రంథం గురువే. వేగంగా మారుతున్న నేటి కాలంలో మన జానపద కళారూపాల్లో చాలా వరకు అంతరించిపోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. ఇలాంటి కళారూపాలను గ్రంథస్థం చేయడంతో పాటు వాటిని సజీవంగా ఉంచడానికి ప్రత్యేక కృషి చేయాల్సిన అవసరం ఉంది' అని చెబుతూ,. ఇదే లక్ష్యంతో 'కళా?దీక్ష' కార్యక్రమాన్ని సంగీత నాటక అకాడమీ నిర్వహిస్తుండటం పట్ల రాష్ట్రపతి సంతోషం వ్యక్తం చేశారు. తర్వాతి తరాన్ని తీర్చిదిద్దేందుకు సీనియర్ కళాకారులు వ్యవస్థీకృత ప్రయత్నాలు చేయాలని ఆమె కోరారు.

కళలకున్న విలువలు, సున్నితత్వం ద్వారా జీవితాన్ని సుసంపన్నం చేసుకోవడానికి అత్యంత సహజమైన శిక్షణ కేంద్రంగా ప్రకృతిని పరిగణిస్తారని రాష్ట్రపతి అన్నారు. 'జీవితం పట్ల సహజమైన ఉత్సాహాన్ని, ప్రకృతితో గాఢమైన అనుబంధాన్ని జానపద, గిరిజన కళలు ప్రతిబింబిస్తాయి. ఈ కళారూపాల్లో సామూహిక జ్ఞాపకాలు, సామాజిక చైతన్యం సహజసిద్ధంగా వ్యక్తమవుతాయి. అందుకే భారతీయ సాంస్కృతిక గుర్తింపునకు పునాదిగా జానపద కళలు నిలుస్తాయి' అన్నారు.

సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్‌లు, సంగీత నాటక అకాడమీ పురస్కారాలు స్వీకరించిన వారిని రాష్ట్రపతి అభినందించారు. వారు భారతీయ సంప్రదాయాన్ని ముందుకు తీసుకెళతారని, మన ఉమ్మడి జ్ఞాపకాలకు సంరక్షకులని, భవిష్యత్తుకోసం దార్శనికతను రూపొందించేవారని రాష్ట్రపతి చెప్పారు.

భారతీయ సాంస్కృతిక పరపతికి ముఖ్యమైన కేంద్రంగా సంగీత నాటక అకాడమిని పరిగణిస్తారని రాష్ట్రపతి చెప్పారు. భవిష్యత్తులో భారతదేశ సాంస్కృతిక శక్తితో ప్రపంచాన్ని ఈ సంస్థ సుసంపన్నం చేస్తూనే ఉంటుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.

# అంతరిక్ష వ్యర్థాల నివారణ, అరికట్టడానికి సాధ్యమైన అన్ని చర్యలు తీసుకుంటున్న ఇస్రో: డాక్టర్ జితేంద్ర సింగ్



న్యూ ఢిల్లీ, ఆగష్టు 14:భారీ సంఖ్యలో భూ నిమ్న కక్ష్యలో (ఎల్ఈఓ) ఉపగ్రహ సమూహాలు లేదా అంతర్జాల ఉపగ్రహ సమూహాలు పెరగటం వల్ల అంతరిక్ష వ్యర్థాలు పేరుకుపోతున్న సమస్యపై భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) తీవ్ర దృష్టి సారించిందని సిబ్బంది-ప్రజా ఫిర్యాదులు-పింఛన్లు, ప్రధాని కార్యాలయ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. ఈ సమస్యను నివారించేందుకు, అరికట్టడానికి సాధ్యమైన అన్ని చర్యలూ ఇస్రో తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు. ఒక ప్రశ్నకు సమాధానంగా ఇవాళ రాజ్యసభలో ఆయన ఈ సమాచారాన్ని ఇచ్చారు.

అంతరిక్ష ఆస్తులను పరిరక్షించడం, క్రియాశీలకంగా వ్యర్థాలను తొలగించటం (ఏడీఆర్- యాక్టీవ్ డెబ్రీస్ రిమూవల్) తదితర మార్గాల ద్వారా వ్యర్థాల ఉత్పత్తిని మరింత పరిమితం చేయడంలో ఇస్రో చేపట్టిన 'వ్యర్థ రహిత అంతరిక్ష మిషన్' కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి తెలిపారు.

అంతర్జాల అనుసంధానత కోసం ఉపయోగించే ఉపగ్రహ సమూహాల్లో సాధారణంగా కొన్ని వేల సంఖ్యలో ఉపగ్రహాలు ఉంటాయని.. ఇది ఆయా కక్ష్య ప్రాంతాల్లో ఒకదానికొకటి ఢీకొనే ప్రమాదాలను గణనీయంగా పెంచుతుందని డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. 'అనేక పెద్ద ఉపగ్రహ సమూహాలు ఢీకొనే విషయంలో స్వయంప్రతిపత్త ప్రమాద నివారణ సామర్థ్యాలను కలిగి ఉన్నప్పటికీ కొన్ని ఉపగ్రహాలు కక్ష్యలోనే విఫలమై ప్రమాదాలను నివారించడానికి తగిన విధంగా పని చేయలేక పోవచ్చు.

గుర్తించలేని చిన్న సైజు వ్యర్థాలు అదనపు ముప్పును కలిగిస్తాయి' అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. 'అలాంటి వ్యర్థాల విషయంలో ఢీకొనే ప్రమాదం నుంచి తప్పించటం లేదా తగిన రక్షణ కల్పించడం సాధ్యం కాదు. ఒకవేళ ఇవి ఢీకొంటే మిషన్‌ను ముగించేంత తీవ్రమైన నష్టం వాటిల్లుతుంది. దీనివల్ల ఉపగ్రహం పనిచేయకుండా పోవడమే కాకుండా మరిన్ని వ్యర్థాలు ఉత్పన్నమవుతాయి. భారీ సంఖ్యలో ఉపగ్రహాలు ఉన్నందున వ్యర్థాలు సృష్టించే ప్రమాదం చాలా ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఉపగ్రహాలు ఎక్కువగా ఉన్న కక్ష్యలో ఢీకొనడం లేదా అనుకోకుండా ముక్కలైపోవడం వల్ల శకలాలు ఏర్పడే ఏ చిన్న సంఘటన నమోదైనా ఈ ముప్పు మరింత పెరుగుతుంది' అంటూ ఆయన వివరించారు.

అంతరిక్ష వ్యర్థాల పర్యవేక్షణ, నివారణపై భారత సంస్థాగత భాగస్వామ్యాన్ని ప్రధానంగా ప్రస్తావిస్తూ.. 1993లో ఏర్పడిన ఇంటర్-ఏజెన్సీ స్పేస్ డెబ్రిస్ కోఆర్డినేషన్ కమిటీ (ఐఏడీసీ) అంతరిక్ష వ్యర్థాల పర్యవేక్షణ, నివారణ విషయంలో పనిచేసే గుర్తింపు పొందిన అత్యున్నత సంస్థగా పరిగణిస్తున్నట్లు డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. అంతరిక్ష శాఖ ఆధ్వర్యంలోని ఇస్రో 1996 నుంచి ఐఏడీసీలో సభ్యత్వాన్ని కలిగి ఉంది. అంతరిక్ష కార్యకలాపాల భద్రతతో సహా అంతరిక్ష వ్యర్థాల నివారణ, దీర్ఘకాలిక స్థిరత్వ అంశాలను ఐక్యరాజ్యసమితి శాంతియుత అంతరిక్ష వినియోగ కమిటీ (యూఎన్-సీఓపీయూఓఎస్) పరిష్కరిస్తుందని ఆయన పేర్కొన్నారు.

ఐఏడీసీ, దీర్ఘకాలిక స్థిరత్వంపై పనిచేస్తోన్న ఐక్యరాజ్యసమితి శాస్త్రవిజ్ఞాన- సాంకేతికత సబ్ కమిటీ (యూఎన్-ఎస్‌టీఎస్‌సీ) వర్కింగ్ గ్రూప్, అంతరిక్ష స్థితిగతులపై అవగాహనకు (ఎస్ఎస్ఏ- స్పేస్ సిచుయేషనల్ అవేర్‌నెస్) సంబంధించిన ఎక్స్‌పర్ట్ గ్రూప్‌తో సహా అంతరిక్ష వ్యర్థాలతో వ్యవహరించే అంతర్జాతీయ వేదికల్లో భారత్‌కు ప్రాతినిధ్యం ఉంది. మారుతున్న అంతరిక్ష వ్యర్థాల స్థితిగతులకు అనుగుణంగా ఐఏడీసీ సభ్యులు క్రమం తప్పకుండా అంతరిక్ష వ్యర్థాలకు సంబంధించిన విషయాలపై చర్చిస్తారని, అంతరిక్ష వ్యర్థాల నివారణ మార్గదర్శకాలను సవరిస్తారని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. దీర్ఘకాలిక స్థిరత్వం, అంతరిక్ష స్థితిగతులపై అవగాహనకు సంబంధించిన వర్కింగ్ గ్రూప్‌లలో కూడా అంతరిక్ష వ్యర్థాల పర్యవేక్షణ, అంతరిక్ష నౌకల భద్రతా అంశాల గురించి చర్చ జరుగుతోంది.

అంతరిక్ష శాఖ, అంతర్జాతీయ ఏజెన్సీల మధ్య అంతరిక్ష వ్యర్థాల పర్యవేక్షణ, నివారణపై సమన్వయం విషయంలో.. ఐఏఏ అంతరిక్ష వ్యర్థాల వర్కింగ్ గ్రూప్, ఐఎస్ఓ వర్కింగ్ గ్రూప్ 7 వంటి ఇతర అంతర్జాతీయ వేదికలు వివిధ మార్గాలను అందిస్తున్నాయని ఆయన తెలిపారు.

భారత అంతరిక్ష కార్యక్రమంలో జీవితకాలం ముగిసిన తర్వాత వ్యర్థాలను తొలగించే చర్యలతో సహా అంతరిక్ష వ్యర్థాల నివారణపై అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన మార్గదర్శకాలను పాటించాలని భారత అంతరిక్ష విధానం తెలియజేస్తోందని కేంద్ర మంత్రి చెప్పారు. జీవితకాలం ముగిసిన ఉపగ్రహాలను తొలగించటానికి సంబంధించిన మార్గదర్శకాలను అమలు చేసే విషయంలో ఇస్రో చేపట్టిన ఒక క్రియాశీల కార్యక్రమమే 'వ్యర్థ రహిత అంతరిక్ష మిషన్ (డెబ్రిస్ ఫ్రీ స్పేస్ మిషన్)'.

2024లో ఇన్-స్పేస్ విడుదల చేసిన నిబంధనలు, మార్గదర్శకాలు, విధానాలు తగిన మిషన్- అనంతర తొలగింపు చర్యలను అవలంబించాలని లేదా సహజ కక్ష్య క్షీణత ద్వారా అంతరిక్షంలోని ఆస్తులు కక్ష్యలో చాలా పరిమిత జీవితాన్ని కలిగి ఉండేలా చూసుకోవాలని భారతీయ అంతరిక్ష రంగానికి చెందిన వారిని ప్రోత్సహిస్తున్నాయని మంత్రి తెలిపారు.

దీర్ఘకాలిక అంతరిక్ష స్థిరత్వానికి అత్యంత కీలకమైన సాధనాల్లో 'అంతరిక్ష స్థితిగతుల అవగాహన (ఎస్ఎస్ఏ)' ఒకటని డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. విన్యాసాలు చేసే సామర్థ్యం- ట్రాక్ చేయగలగడం వంటి సాంకేతిక అవసరాలను ఆపరే టర్లు పూర్తి చేయడం, రిజిస్ట్రేషన్- కాంటాక్ట్ పాయింట్ల భాగస్వామ్యం వంటి ప్రాథమిక బాధ్యతలను నెరవేర్చడం, బలమైన నియంత్రణ ఫ్రేమ్‌వర్క్‌ను నిర్మారించడం వంటివి ఇతర ముఖ్యమైన అవసరాలని ఆయన అన్నారు.

అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన అంతరిక్ష వ్యర్థ నివారణ చర్యలను విస్తృతంగా అమలు చేయడం, 'వ్యర్థ రహిత అంతరిక్ష మిషన్' అవసరాలను మరింత మెరుగ్గా పాటించడం.. అంతరిక్ష ఆస్తులను రక్షించడం, వ్యర్థాల ఉత్పత్తిని అరికట్టడంలో కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి తెలిపారు. అంతరిక్ష వ్యర్థాల వృద్ధిని తగ్గించడంలో 'క్రియాశీల వ్యర్థాల తొలగింపు' (ఏడీఆర్) ప్రాముఖ్యతను కూడా ఆయన ప్రధానంగా చెప్పారు. ఏడీఆర్‌కి ముందస్తు కార్యకలాపాలు ఇప్పటికే కక్ష్యలో ప్రదర్శనల ద్వారా ప్రారంభమయ్యాయి. కాలక్రమేణా ఇవి మరింత అభివృద్ధి చెందుతాయన్న అంచనా ఉందని తెలిపారు.

అంతర్జాతీయ సహకారం, స్వదేశీ సామర్థ్యాలు రెండింటి ప్రాముఖ్యతను ప్రధానంగా చెబుతూ.. సమగ్ర అంతరిక్ష స్థితిగతుల అవగాహన (ఎస్ఎస్ఏ), దీర్ఘకాలిక స్థిరత్వానికి అంతర్జాతీయ సహకారం, డేటా షేరింగ్ చాలా ముఖ్యమని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ఎదురవుతున్న సవాళ్లను పరిష్కరించేందుకు వినూత్న చర్యలు, పరిశోధన- అభివృద్ధితో (ఆర్-డీ) పాటు అంతరిక్ష వస్తువుల పర్యవేక్షణ కోసం స్వదేశీ సామర్థ్య పెంపు ద్వారా స్వయంసమృద్ధి సాధిస్తామని ఆయన తెలిపారు.

# బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీ



ఆదిలాబాద్, ఆగష్టు 14: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బిజెపి ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలో హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీ కన్నెపల్లి నుంచి ముత్యంపేట వరకు ఉత్సాహంగా సాగింది. జాతీయ జెండాలను చేతబట్టుకొని బిజెపి నాయకులు, కార్యకర్తలు, యువకులు పెద్ద సంఖ్యలో బైక్‌లపై ర్యాలీలో పాల్గొన్నారు. దేశభక్తిని చాటుతూ జాతీయ జెండాలతో ర్యాలీ ముందుకు సాగగా, మార్గమధ్యంలో ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నాయకులు తెలిపారు. దేశ సమైక్యత, సార్వభౌమత్వం, జాతీయ భావాన్ని ప్రతి ఒక్కరిలో పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు మరింతగా నిర్వహించాలని వారు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తే సత్తయ్య, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు గోపతి రాజయ్య, మండల అధ్యక్షుడు రవిగౌడ్, ప్రధాన కార్యదర్శి పత్తిపాక సంతోష్, పిఏసిఎస్ చైర్మన్ బెదద సురేష్,ఉప అధ్యక్షులు ఎర్రం విజేందర్, ధంకా లక్ష్మణ్, రాకేశ్,తులసి మాజీ ఉపసర్పంచ్ లు నలిమెల మహేష్, ముత్తే వెంకటేష్, దుమ్మని సత్తయ్య, నాయకులు బియ్యల సతీష్ రావు,మల్లేష్, గిరిధర్, కుమార్, హరిక్రిష్ణ, శ్రీనివాస్, దిలీప్, మొండయ్య, బుచ్చన్న, తది తరులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జోగిపేట్‌లో పోలీసుల కమ్యూనిటీ కాంటాక్ట్..

### -31 ద్విచక్ర వాహనాలు, కారు స్వాధీనం

ఆదిలాబాద్, ఆగష్టు 14: ప్రజల రక్షణ, సంరక్షణను సమర్థంగా నిర్వహించడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఇచ్చోడ రూరల్ సీఐ సీహెచ్. రమేష్ తెలిపారు. ఇందులో భాగంగా ఇచ్చోడ మండలంలోని జోగిపేట్ గ్రామంలో 50 మంది పోలీసు సిబ్బందితో కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు.

ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని 31 ద్విచక్ర వాహనాలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. సరైన ధ్రువపత్రాలు లేని ఐదు వాహనాలపై చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు సీఐ తెలిపారు. అలాగే రూ.5 వేల విలువైన కలపను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా సీఐ రమేష్ ప్రజలతో మాట్లాడుతూ అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉంటూ సత్ప్రవర్తనతో జీవించాలని సూచించారు. గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, దొంగతనాలు, దోపిడీలకు పాల్పడవద్దని హెచ్చరించారు. గొడవలకు దారితీసేలా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడపడం, దొంగ వాహనాలను కొనుగోలు చేయడం వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు.

# 'గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు'

నల్గొండ, ఆగష్టు 14: పుస్తక పఠనంతోనే పరిపూర్ణ విజ్ఞానం లభిస్తుందని హయత్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సీనియర్ గ్రంథాలయ శాస్త్ర అధ్యాపకుడు డా.ఆనందం దుర్గా ప్రసాద్ అన్నారు. నల్లగొండలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలలో భారత గ్రంథాలయ పితామహుడు డా.ఎస్.ఆర్.రంగనాథన్ 134వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆనందం దుర్గా ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రంథాలయ శాస్త్ర పితామహుడు డా.ఎస్.ఆర్.రంగనాథన్ గ్రంథాలయ రంగంలో ప్రవేశపెట్టిన 'ఐదు సూత్రాలు' సమాజానికి అత్యంత విలువైనవని ఆయన కొనియాడారు. నేటి డిజిటల్ యుగంలోనూ విద్యార్థులకు గ్రంథాలయాలే అసలైన విజ్ఞాన భాండాగారాలన్నారు.




# ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వం, మార్గదర్శనంలో రైతుల సంక్షేమం కోసం
# రాష్ట్రాలకు సాధ్యమైన మేరకు అన్ని విధాలుగా మద్దతు: శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్

న్యూఢిల్లీ, ఆగష్టు 14:'ప్రధాన మంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన' (పీఎంఆర్‌కేవీవై), 'కృషోన్నతి యోజన' కింద రాజస్థాన్, తెలంగాణ రాష్ట్రాల కోసం భారీ ఆర్థిక కేటాయింపులకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ఆమోదం తెలిపారు. రెండు రాష్ట్రాల్లోని పురోగతి, వ్యయ వివరాలు, రైతుల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని... రాజస్థాన్‌కు రూ. 340.59 కోట్లు, తెలంగాణకు రూ. 265.12 కోట్లు కేటాయించారు. రైతు గుర్తింపు కార్డులు, ఎరువుల పంపిణీకి సంబంధించి తెలంగాణ అనుసరిస్తున్న నూతన విధానాన్ని శ్రీ చౌహాన్ అభినందించారు. వ్యవసాయ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్న రాజస్థాన్ ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపిన కేంద్ర మంత్రి... 'కిసాన్ క్రెడిట్ కార్డుల' స్థితిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

రాజస్థాన్ వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ కిరోరి లాల్ మీనా, తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరావులతో భోపాల్ నుంచి శ్రీ చౌహాన్ ఈ రోజు వీడియో అనుసంధానం ద్వారా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో 'పీఎం ఆర్‌కేవీవై', 'కృషోన్నతి యోజన' అను రెండు ప్రధాన వ్యవసాయ పథకాల కింద... ఆయా రాష్ట్రాలకు కీలక ఆర్థికపరమైన ఆమోదాలను మంజూరు చేశారు. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీ అతీష్ చంద్ర, కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, రెండు రాష్ట్రాలకు చెందిన వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఆయా రాష్ట్రాల ప్రాజెక్టుల ఆమోద కమిటీ సమావేశాల్లో ఆమోదించిన వార్షిక కార్యాచరణ ప్రణాళికలు, తొలి విడత నిధుల వినియోగం, ఇప్పటివరకు సాధించిన వ్యయ సంబంధిత పురోగతిని సమీక్షించిన అనంతరం కేంద్ర మంత్రి ఈ ఆమోదాలు జారీ చేశారు.

రాజస్థాన్ కోసం, 2026 ఏప్రిల్ 20న జరిగిన పీఏసీ సమావేశం 2026-27 సంవత్సరానికి గానూ రూ. 849.37 కోట్ల వార్షిక కార్యాచరణ ప్రణాళికకు ఆమోదం తెలిపింది. ఇందులో కేంద్రం వాటా రూ. 509.62 కోట్లు. ఆ తర్వాత, 2026 మే 4న రూ. 216.13 కోట్లతో కూడిన మొదటి 'మదర్ శాంక్షన్' (ప్రధాన మంజూరు) జారీ చేశారు. ఇప్పటి వరకు, రాష్ట్రం రూ. 164.39 కోట్లు ఖర్చు చేసింది. ఇది మొదటి మంజూరు మొత్తంలో 76.06 శాతానికి సమానం. శ్రీ చౌహాన్ ఆమోదంతో ప్రస్తుతం రాజస్థాన్‌కు మొత్తం రూ. 340.59 కోట్లు కేటాయించారు. ఇందులో ఆర్‌కేవీవై కింద రూ. 216.12 కోట్లు, కేవై కింద రూ. 124.47 కోట్లు ఉన్నాయి.

తెలంగాణకు సంబంధించి, 2026 ఏప్రిల్ 27న జరిగిన పీఏసీ సమావేశం 2026-27 సంవత్సరానికి గానూ రూ. 651.06 కోట్ల వార్షిక కార్యాచరణ ప్రణాళికకు ఆమోదం తెలిపింది. ఇందులో కేంద్రం వాటా రూ. 390.63 కోట్లు. దీనికి సంబంధించి 2026 మే 12న రూ. 157.65 కోట్లతో మొదటి 'మదర్ శాంక్షన్' (ప్రధాన మంజూరు) జారీ చేశారు. ఇప్పటివరకు రాష్ట్రం రూ. 96.05 కోట్లు ఖర్చు చేసింది. ఇది మంజూరైన మొత్తంలో 60.93 శాతానికి సమానం. వ్యయ పురోగతిని పరిగణనలోకి తీసుకుని, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ఆమోదం మేరకు, తెలంగాణకు ప్రస్తుతం మొత్తం రూ. 265.12 కోట్లు కేటాయించారు. ఇందులో ఆర్‌కేవీవై కింద రూ. 157.66 కోట్లు, కేవై కింద రూ. 107.46 కోట్లు కేటాయించారు.

రైతు గుర్తింపు కార్డులు, ఎరువుల పంపిణీకి సంబంధించి తెలంగాణ అనుసరిస్తున్న నూతన విధానాన్ని శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రశంసించారు. వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తున్నందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిని అభినందించారు. ఈ విధానం రైతులకు మరింత పారదర్శకంగా, సమర్థంగా సేవలందించడంలో సహాయపడుతుందని ఆయన పేర్కొన్నారు.

నూనె గింజలు, పప్పుధాన్యాల మిషన్ల కింద తెలంగాణ చేస్తున్న వ్యయం షెడ్యూల్ కంటే వెనకబడి ఉందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి పేర్కొన్నారు. ఈ మిషన్ల అమలు పురోగతిని, వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.

రాజస్థాన్ రాష్ట్రంలో వ్యవసాయ సమగ్ర అభివృద్ధికి సంబంధించి శ్రీ చౌహాన్ ఆ రాష్ట్ర ప్రభుత్వానికి తన శుభాకాంక్షలు తెలియజేశారు. రైతులకు సకాలంలో, ఎటువంటి ఇబ్బందులూ లేకుండా రుణ సదుపాయం అందేలా చూసేందుకు 'కిసాన్ క్రెడిట్ కార్డ్' వ్యవహారాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు.

రాష్ట్రాల్లో వ్యవసాయ పథకాలను సకాలంలో, సమర్థంగా అమలు చేయడమే ఈ ఆర్థిక ఆమోదాల లక్ష్యమని శ్రీ చౌహాన్ అన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వం, మార్గదర్శనంలో కేంద్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాల దృష్ట్యా వనరులు, సాంకేతిక సహాయం, పర్యవేక్షణను బలోపేతం చేయడానికి రాష్ట్రాలతో కలిసి సంపూర్ణ సమన్వయంతో పనిచేస్తోందని ఆయన తెలిపారు. ఈ ఆర్థిక కేటాయింపులు రెండు రాష్ట్రాల్లోనూ వ్యవసాయ మౌలిక సదుపాయాలు, ఉత్పాదకత పెంపు, ఉత్పాదక మద్దతు, రైతు సంక్షేమానికి సంబంధించిన కార్యకలాపాలను వేగవంతం చేస్తాయని భావిస్తున్నట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ఈ నిధుల విడుదల... రాష్ట్ర స్థాయిలో పథకాల అమలును వేగవంతం చేస్తుందని, వాటి ప్రయోజనాలు రైతులకు మరింత సమర్థంగా చేరవేస్తుందని శ్రీ చౌహాన్ విశ్వాసం వ్యక్తం చేశారు.

## భూత్పూర్‌లో బీజేపీ హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీ..

మహబూబ్‌నగర్, ఆగష్టు 14: దేశభక్తి నినాదాలతో భూత్పూర్ పట్టణం మార్మోగింది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ రాష్ట్ర నాయకుడు సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీ ఉత్సాహభరితంగా సాగింది. జాతీయ జెండాలను చేతబూని ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా బయలుదేరిన కార్యకర్తలు పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ప్రయాణించారు. దేశభక్తి నినాదాలు చేస్తూ ముందుకు సాగిన ర్యాలీతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. దేశం పట్ల బాధ్యత, జాతీయ సమైక్యత, సార్వభౌమత్వం పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించడమే హర్ ఘర్ తిరంగా కార్యక్రమం లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి స్వాతంత్ర్య స్ఫూర్తిని చాటాలని ప్రజలకు పిలుపునిచ్చారు. యువతలో దేశభక్తి భావాలను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఆయన తెలిపారు.




## '2026 హర్ ఘర్ తిరంగా ప్రచారోద్యమం'లో భాగంగా తిరంగా ర్యాలీ

న్యూఢిల్లీ, ఆగష్టు 14:స్వాతంత్ర్య దినోత్సవాలను పురస్కరించుకొని '2026 హర్ ఘర్ తిరంగా ప్రచారోద్యమం'లో భాగంగా "తిరంగా ర్యాలీ"ని పౌర విమానయాన శాఖ ఈ రోజు ఏర్పాటు చేసింది. ఈ ర్యాలీని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ కింజరాపు రామ్మోహన్ నాయుడు పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి శ్రీ మురళీధర్ మొహోల్ సమక్షంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పౌర విమానయాన శాఖ కార్యదర్శి శ్రీ సమీర్ కుమార్ సిన్హాతో పాటు మంత్రిత్వశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఒక డిజిటల్ వీడియో వాల్‌ను శ్రీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, శ్రీ మురళీధర్ మొహోల్ ప్రారంభించడంతో వేడుకలు మొదలయ్యాయి. ఆ తరువాత వందే మాతర గేయాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు, తదితరులు పాలు పంచుకున్నారు. తదనంతరం, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ కింజరాపు రామ్మోహన్ నాయుడు తిరంగా ర్యాలీని ప్రారంభించారు. మంత్రిత్వశాఖ అధికారులు, సిబ్బంది, మంత్రిత్వ శాఖకు అనుబంధంగా ఉన్న అన్ని కార్యాలయాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థల అధికారులు, సిబ్బంది జాతీయ జెండాలతో ఊరేగింపులో పాల్గొన్నారు.

శ్రీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, శ్రీ మురళీధర్ మొహోల్, శ్రీ సమీర్ కుమార్ సిన్హా సారథ్యంలో ఊరేగింపు ఉడాన్ భవన్ నుంచి మొదలై, రాజీవ్ గాంధీ భవన్లో నెలకొన్న ఏవియేషన్ పార్కు వరకు ర్యాలీ సాగింది. అధికారులు, సిబ్బంది చేతులలో త్రివర్ణ పతాకాలను పట్టుకొని ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం స్వాతంత్ర్య దినోత్సవంతో ముడిపడిన దేశాభిమాన భావనకు అద్దం పట్టింది.

ఏవియేషన్ పార్కులో జాతీయ గీతాలాపనతో కార్యక్రమం ముగిసింది.

'2026 హర్ ఘర్ తిరంగా ప్రచారోద్యమం'లో భాగంగా ఈ తిరంగా ర్యాలీని నిర్వహించారు. మనసును ఉప్పొంగిపోయేటట్లు చేసే జాతీయ పతాకాన్ని చేత ధరించి జాతీయ సమైక్యత, సంతోషాల విలువలు ఉట్టిపడేలా స్వాతంత్ర్య దినోత్సవాన్ని నిర్వహించుకొనేందుకు పౌరులకు ఈ ప్రచార ఉద్యమం స్ఫూర్తిని అందిస్తుంది. ఈ కార్యక్రమంలో ఏఏఐ చైర్మన్ శ్రీ విపిన్ కుమార్, డీజీసీఏ డైరెక్టర్ జనరల్ శ్రీ వీర్ విక్రమ్ యాదవ్, ఏఏఐబీ డైరెక్టర్ జనరల్ శ్రీ జి.వి.జి. యుగంధర్, బీసీఏఎస్ డైరెక్టర్ జనరల్ శ్రీ రాజేశ్ నిర్వాణ్, పాల్గొన్నారు.

## బెజ్జంకి ప్యాక్స్ చైర్మన్‌గా ఒగ్గు దామోదర్ ప్రమాణ స్వీకారం



కరీంనగర్, ఆగష్టు 14: బెజ్జంకి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ప్యాక్స్) చైర్మన్‌గా ఒగ్గు దామోదర్ ప్రమాణ స్వీకారం చేశారు. మండల కేంద్రంలోని సహకార సంఘం ఏసీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై నూతన చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్యాక్స్ వ్యవస్థ రైతులకు మరింత చేరువగా పనిచేయాలని సూచించారు. రైతులకు అవసరమైన రుణాలు, వ్యవసాయ సేవలు, ప్రభుత్వ పథకాలు సకాలంలో అందేలా పాలకవర్గం కృషి చేయాలని అన్నారు.

రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కారానికి చొరవ చూపాలని, ప్యాక్స్‌ను మరింత బలోపేతం చేసి రైతులకు అండగా నిలవాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నూతన చైర్మన్ ఒగ్గు దామోదర్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్యాక్స్ పరిధిలోని రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సంఘం నిబంధనలు, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా పనిచేస్తూ ప్యాక్స్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. రైతులకు అవసరమైన సేవలను సకాలంలో అందించడం, ప్రభుత్వ పథకాలను వారికి చేరువ చేయడం, ప్యాక్స్ కార్యకలాపాల్లో పారదర్శకత పాటించడం తన లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్యాక్స్ సభ్యులను అభినందించారు.

## చోరీకి గురైన పురాతన వస్తువుల సేకరణ

న్యూఢిల్లీ, ఆగష్టు 14:వలస పాలన కాలంలో విదేశాలకు తరలించిన పురాతన వస్తువులను వెనక్కి తీసుకువచ్చే అంశాన్ని ప్రభుత్వం పలు వేదికలపై ప్రస్తావిస్తోంది.

జాతీయ, అంతర్జాతీయ చట్టాలు, ఒప్పందాలను పరిగణలోకి తీసుకుని, ఒక్కో సందర్భానికి అనుగుణంగా ఈ సేకరణ ప్రక్రియను చేపడతారు. సంబంధిత దేశాలు, ప్రభుత్వాల మధ్య పరస్పర అవగాహన, సహకారం ద్వారా వస్తువులను తిరిగి తీసుకురావటం సాధ్యమవుతుంది.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎన్నో మ్యూజియాలు, ఆర్ట్ గ్యాలరీల్లో భారతదేశానికి చెందిన పురాతన వస్తువులున్నాయి. ప్రైవేటు వ్యక్తుల వద్ద కూడా కొన్ని వస్తువులున్నాయి.

అయితే ఆ వస్తువుల సేకరణకు సంబంధించిన సమగ్ర జాబితా అందుబాటులో లేదు.

భారత దేశానికి చెందిన పురాతన వస్తువులను అక్రమంగా విదేశాలకు పంపినట్లు నివేదికలు వచ్చిన ప్రతీసారీ వాటిని వెనక్కి తీసుకురావటానికి భారత రాయబార కార్యాలయం, మిషన్ ద్వారా చర్యలు తీసుకుంటున్నారు.

## గిరిజన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక తీజ్ పండుగ

నిజామాబాద్, ఆగష్టు 14: గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే తీజ్ పండుగ వేడుకలను నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం రూప్ల తాండ గ్రామంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సర్దార్, సంతోష్, సీతారాం, రాజేష్, గంగాధర్, భాస్కర్ నాయక్‌ల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు తీజ్ పండుగ ప్రాధాన్యతను వివరించారు. గిరిజనుల ఆచారాలు, సంప్రదాయాలను ప్రతిబింబించే ఈ పండుగను ప్రతి సంవత్సరం సంప్రదాయబద్ధంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు.

పండుగ వేడుకల్లో యువత, మహిళలు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు. సంప్రదాయ దుస్తుల్లో మహిళలు, యువత ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తీజ్ పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ తీజ్ పండుగ ద్వారా గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఇలాంటి పండుగలు గ్రామ ప్రజల మధ్య ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత, మహిళలు, చిన్నారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ అమలు చేయాలి



ఖమ్మం, ఆగష్టు 14:జిల్లాలో పనిచేస్తున్న అర్హులైన వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ అన్‌ఎయిడెడ్, ఎయిడెడ్ పాఠశాలల్లో ప్రభుత్వం నిర్దేశించిన 50 శాతం ఫీజు రాయితీని కచ్చితంగా అమలు చేయాలని జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు ఎండీ యాకూబ్ పాషా కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్, డీఎంఏసీ చైర్మన్‌కు వినతిపత్రం సమర్పించారు.

జిల్లా విద్యాశాఖ ఆర్‌సీ నంబర్ 27, తేదీ 16-06-2026 ద్వారా జారీ చేసిన ఆదేశాల ప్రకారం అర్హులైన వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించాల్సి ఉందని యాకూబ్ పాషా తెలిపారు.

ప్రజా సమస్యలను ప్రభుత్వం, ప్రజల దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంతో పాటు సామాజిక చైతన్యం పెంపొందించడంలో జర్నలిస్టుల సేవలు ఎంతో ముఖ్యమన్నారు.

అయితే జిల్లాలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలు అర్హులైన వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రభుత్వం నిర్దేశించిన ఫీజు రాయితీని అమలు చేయడం లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు.

పుస్తకాలు, ఇతర విద్యా ఖర్చులతో జర్నలిస్టు కుటుంబాలపై ఆర్థిక భారం పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం కల్పించిన 50 శాతం ఫీజు రాయితీ వారికి గణనీయమైన ఉపశమనం కలిగిస్తుందని తెలిపారు.

జిల్లా పరిధిలోని అన్ని సంబంధిత ప్రైవేట్ అన్‌ఎయిడెడ్, ఎయిడెడ్ పాఠశాలలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి, అర్హులైన వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీని ఏకరీతిగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను యాకూబ్ పాషా కోరారు. ప్రభుత్వ ఆదేశాలు క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో అమలయ్యేలా విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించాలని, అర్హులైన జర్నలిస్టు కుటుంబాలకు ప్రభుత్వం ఉద్దేశించిన సంక్షేమ ప్రయోజనం అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

## ఆగస్టు 15న ముఖ్యమంత్రి చేతుల రేవంత్‌రెడ్డి సంగారెడ్డి నుంచి రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

### -డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్

మహబూబ్‌నగర్, ఆగష్టు 14:రాష్ట్ర ప్రజలందరికీ 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో, రాహుల్‌గాంధీ ఆశయాలకు అనుగుణంగా ప్రజా ప్రభుత్వం పేదలు, విద్యార్థులు, కార్మికులకు సామాజిక, ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించే దిశగా పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని ఆయన తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం చేపడుతున్న పలు కార్యక్రమాలను సంజీవ్ ముదిరాజ్ వివరించారు.

**స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ**

ఆగస్టు 15న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంగారెడ్డి నుంచి రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారని సంజీవ్ ముదిరాజ్ తెలిపారు. 119 అసెంబ్లీ నియోజకవర్గాలు, 33 జిల్లాల కేంద్రాల్లో ప్రజాప్రతినిధులు, అధికారుల ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

క్యూఆర్ కోడ్‌తో కూడిన ఆధునిక కార్డుల ద్వారా రేషన్ పంపిణీలో మరింత పారదర్శకత తీసుకురావచ్చని తెలిపారు. రాష్ట్రంలో కోట్లాది మంది లబ్ధిదారులకు సన్నబియ్యం అందిస్తున్నామని చెప్పారు.

తెలంగాణలో రేషన్ కార్డుల సంఖ్య 2026 జూలై నాటికి 1.06 కోట్లకు పైగా ఉన్నట్లు ప్రభుత్వ ప్రజాపంపిణీ వ్యవస్థ గణాంకాలు వెల్లడి స్తున్నాయి.

**గిగ్ కార్మికులకు భద్రత**

స్విగ్గీ, జొమాటో, ఓలా, ఉబెర్ తదితర సంస్థల్లో పనిచేస్తున్న గిగ్ కార్మికుల సంక్షేమం కోసం చట్టపరమైన రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని సంజీవ్ ముదిరాజ్ తెలిపారు.

# దేశీయంగా అభివృద్ధి చేసిన 'గరుడ్' హై రిజల్యూషన్ బైనాక్యులర్స్‌ను సివిల్ మార్కెట్‌లోకి విడుదల చేసిన ఐఓఎల్

న్యూ ఢిల్లీ, ఆగష్టు 14:రక్షణ ఉత్పత్తుల విభాగం పరిధిలోని మినీ రత్న కేటగిరీ-ఎ రక్షణ ప్రభుత్వ రంగ సంస్థ - ఇండియా ఆప్టెల్ లిమిటెడ్ (ఐఒఎల్) స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన 'గరుడ్' హై రిజల్యూషన్ బైనాక్యులర్లను సివిల్ మార్కెట్ లోకి ప్రవేశపెట్టింది. ఇండియా ఆప్టెల్ లిమిటెడ్‌కు చెందిన డెహ్రాడూన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ అభివృద్ధి చేసి, తయారు చేసిన గరుడ్ స్వదేశీ డిజైన్, తయారీ ద్వారా ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తిని ప్రతిబింబిస్తోంది. 1943 నుంచి అత్యంత కచ్చితత్వంతో కూడిన ఆప్టికల్ పరికరాల తయారీ అనుభవంతో రూపొందిన గరుడ్ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రక్షణ రంగంలో సాధించిన నైపుణ్యంతో మేళవించింది. పౌరుల వినియోగానికి విశ్వసనీయమైన, నాణ్యమైన ఆప్టికల్ పనితీరును అందించేలా దీనిని రూపొందించారు.

గరుడ్ బైనాక్యులర్స్ 8 రెట్లు మాగ్నిఫికేషన్, 7.6 డిగ్రీల విస్తృత దృశ్య పరిధిని కలిగి ఉన్నాయి. దీంతో దూరంలోని వస్తువులను స్పష్టంగా వీక్షించడంతో పాటు, విస్తృత ప్రాంతాన్ని ఒకేసారి పరిశీలించవచ్చు. వ్యక్తిగత కంటి చూపునకు అనుగుణంగా5 డయాప్టర్ సర్దుబాటు సౌకర్యం, ఎక్కువసేపు సౌకర్యవంతంగా వీక్షించేందుకు సాఫ్ట్‌టచ్ ఐకప్స్, చేతిలో సురక్షితంగా పట్టుకునేలా ఎర్గోనామిక్ గ్రిప్ ఇందులో ఉన్నాయి. వాతావరణ పరిస్థితులను తట్టుకునేలా రూపొందించిన దీని నిర్మాణం, వివిధ రకాల బహిరంగ పరిస్థితుల్లోనూ విశ్వసనీయంగా వినియోగించుకునేలా ఉంటుంది.

సుమారు 610 గ్రాముల బరువున్న గరుడ్ బైనాక్యులర్స్‌ను తేలికగా తీసుకెళ్లేందుకు అనువుగా ఉండటంతో పాటు విశ్వసనీయ పనితీరును అందించే కాంపాక్ట్ డిజైన్‌తో రూపొందించారు. పక్షుల వీక్షణ, వన్యప్రాణుల పరిశీలన, ప్రకృతి అన్వేషణ, ప్రయాణాలు, క్రీడలు, అటవీ కార్యకలాపాలు, సముద్ర సంబంధిత కార్యకలాపాలు, భద్రతా అవసరాలు తదితర విభిన్న వినియోగాలకు ఇది అనుకూలంగా ఉంటుంది.

ఈ ఆవిష్కరణతో ఐఓఎల్ పౌర ఆప్టికల్ పరికరాల మార్కెట్‌లోకి అడుగుపెట్టింది. దశాబ్దాలుగా దేశ సేవలో కచ్చితత్వం నిలబెట్టుకుంటూ రక్షణ రంగానికి చెందిన ఆప్టికల్ సామర్థ్యాలను 'గరుడ్' ద్వారా విస్తృత ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చింది. దీంతో ప్రకృతి, బహిరంగ కార్యకలాపాలపై ఆసక్తి ఉన్నవారితో పాటు వివిధ రంగాల నిపుణులు ఈ సాంకేతికతను వినియోగించుకునే అవకాశం కలిగింది కఠినమైన ఆపరేషనల్ పరిస్థితుల్లో రక్షణ దళాలు, కేంద్ర సాయుధ పోలీసు బలగాలకు విశ్వసనీయమైన పరికరంగా సేవలందించిన బైనాక్యులర్ వేదిక ఆధారంగా 'గరుడ్'ను అభివృద్ధి చేశారు.

పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన 'గరుడ్' ఆప్టికల్ ప్రొడక్ట్‌ను న్యూఢిల్లీలోని డీపీఎస్యూ భవన్‌లో ఈ రోజు ఘనంగా ఆవిష్కరించారు. రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన ల్యాండ్ సిస్టమ్స్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ గరిమా భగత్ ముఖ్య అతిథిగా హాజరై ఈ ఆప్టికల్ ప్రొడక్ట్‌ను అధికారికంగా ప్రారంభించారు. రక్షణ ఉత్పత్తుల విభాగం, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖకు చెందిన ఉన్నతాధికారులు, కేంద్ర సాయుధ పోలీసు బలగాల ప్రతినిధులు, వైల్డ్‌లైఫ్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రతినిధులతో పాటు ఐఓఎల్ బోర్డు డైరెక్టర్లు, ఉన్నతాధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# పేదల వైద్యానికి సీఎం సహాయనిధి భరోసా..

అమరావతి, ఆగష్టు 14: నియోజకవర్గంలో ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని ఆముదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పీఏసీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. ఆముదాలవలస నియోజకవర్గానికి చెందిన పలువురు పేద కుటుంబాలకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సహాయ చెక్కులను ఆయన స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు.

వివిధ అనారోగ్య సమస్యలతో వైద్య చికిత్స పొందిన కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే కూన రవికుమార్ అందజేశారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకోవడంతో పాటు కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలపై వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ప్రభుత్వం సహాయం అందిస్తోందని తెలిపారు.

చెక్కులు అందుకున్న లబ్ధిదారుల్లో వంజంగి గ్రామానికి చెందిన అన్నెపు దివ్యకు రూ.66,500, బెండు ధర్మారావుకు రూ.1,26,000, పూజారిపేటకు చెందిన ఇందిరాపు నితిన్‌కుమార్‌కు రూ.23,400, పాత ఆముదాలవలసకు చెందిన బండి చంద్రమౌళికి రూ.32,000 చొప్పున మొత్తం రూ.2,47,900 విలువైన చెక్కులను పంపిణీ చేశారు.

పేద ప్రజలకు వైద్య సహాయం అందించడంలో కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని ఎమ్మెల్యే రవికుమార్ తెలిపారు. అత్యవసర వైద్య చికిత్స అవసరమైన పేద కుటుంబాలు ఎప్పుడైనా తనను సంప్రదించవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# స్వాతంత్ర్య వేడుకలను పకడ్బందీగా నిర్వహించాలి

## -ఎలాంటి లోపాలు ఉండకూడదు: అడిషనల్ ఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి



అమరావతి, ఆగష్టు 14:ఆగస్టు 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో సమిష్టిగా కృషి చేయాలని జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) రోహిత్‌కుమార్ చౌదరి సూచించారు. స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల భద్రతా ఏర్పాట్లు, బందోబస్తు, పరేడ్ రిహార్సల్స్‌ను ఆయన పరిశీలించారు. రిహార్సల్‌లో భాగంగా వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పరేడ్ పరిశీలన వాహనంలో వెళ్లి సాయుధ పోలీసు బలగాల కవాతును పరిశీలించారు. కవాతు బృందాల క్రమశిక్షణ, సమన్వయం, పరేడ్ నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.

ఆగస్టు 15న జరిగే ప్రధాన కార్యక్రమానికి హాజరయ్యే ప్రముఖులు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులు, ఉన్నతాధికారులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన భద్రతా చర్యలు, మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. వేడుకలు ప్రారంభం నుంచి ముగింపు వరకు ప్రతి అంశాన్ని ముందస్తుగా సమీక్షించి, ఎలాంటి సమస్యలకు తావులేకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం పోలీసు జాగిలాల ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమాన్ని సమన్వయంతో, సమిష్టి కృషితో విజయవంతం చేయాలని పోలీసు అధికారులు, సిబ్బందికి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ గాంధీరెడ్డి, ఏఆర్ ఇన్‌స్పెక్టర్లు కృష్ణ, గోపీనాథ్, యువరాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.

# గైరన్ తండా రహదారి నిర్మాణానికి భూమిపూజ

## -వచ్చే ఏడాది నాటికి పనులు పూర్తి చేస్తాం: ఎమ్మెల్యే సంజీవరెడ్డి.

## -రహదారి కోసం భూములిచ్చిన రైతులకు సన్మానం.



సంగారెడ్డి ఆగస్టు 14 (నేటి నిజం ప్రతినిధి)సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండల పరిధిలోని వాంగ్ధల్ గైరన్ తండా (డబ్ల్యూ)కు రహదారి నిర్మాణానికి నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, సబ్ కలెక్టర్ ఉమాహారతి శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే ట్రాక్టర్‌పై తండాకు చేరుకుని, అక్కడ నిర్మించనున్న వంతెన, రహదారి పనులపై అధికారులతో చర్చించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ.. గత ఏడాది ఇదే సమయంలో గైరన్ తండాను సందర్శించి రహదారి దుస్థితిని స్వయంగా పరిశీలించినట్లు తెలిపారు. కొన్ని సాంకేతిక కారణాలు, కాంట్రాక్టర్ల వల్ల పనుల్లో జాప్యం జరిగిందని, ఇక ఎలాంటి ఆలస్యం లేకుండా పనులు చేపట్టి వచ్చే ఏడాది నాటికి రహదారి నిర్మాణాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని అనేక రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని ఎమ్మెల్యే విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఒక్కో రహదారికి మరమ్మతులు, అభివృద్ధి పనులు చేపడుతున్నామని, దశలవారీగా నియోజకవర్గంలోని అన్ని రహదారులను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

విద్యుత్, తాగునీటి సమస్యలు పరిష్కరిస్తాం

గైరన్ తండాలో విద్యుత్, తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామపంచాయతీ నిధుల నుంచి కేవలం రూ.4 వేల డీడీ చెల్లిస్తే తండాకు అవసరమైన 10 విద్యుత్ స్తంభాలతో పాటు విద్యుత్ సామగ్రిని అందించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

### రహదారి కోసం భూములిచ్చిన రైతులకు సన్మానం

రహదారి నిర్మాణం కోసం తమ భూములను అందించిన రైతులను ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి సన్మానించి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం రైతులు తమ భూములను అందించి సహకరించడం అభినందనీయమని అన్నారు.

### "మా తండాకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చింది"

రహదారి నిర్మాణానికి భూమి పూజ జరగడంతో గైరన్ తండావాసులు ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా రహదారి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని, ఎమ్మెల్యే సంజీవరెడ్డి చొరవతో తమ తండాకు రహదారి మంజూరు కావడంతో పాటు నిర్మాణ పనులకు భూమి పూజ జరగడం సంతోషంగా ఉందన్నారు.

"దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని సంవత్సరాలు గడిచినా మా తండాకు మాత్రం రహదారి సౌకర్యం అందలేదు. ఇప్పుడు రహదారి నిర్మాణానికి భూమి పూజ జరగడంతో మా తండాకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లుగా ఉంది" అని తండావాసులు హర్షం వ్యక్తం చేశారు.

70 ఏళ్లుగా ఎదురుచూస్తున్న తమ తండా రహదారి కలను సాకారం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని వారు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే చొరవతో రహదారి, విద్యుత్, తాగునీటి సౌకర్యాలు అందుబాటులోకి రానుండటంపై సంతోషం వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో సిర్గాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, వాంగ్ధల్ గ్రామం, గైరన్ తండా ప్రజలు, పార్టీ కార్యకర్తలు, మహిళలు, యువకులు, సర్పంచులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గోదావరిఖనిలో హోరెత్తిన హర్ ఘర్ తిరంగా ర్యాలీ

## -త్రివర్ణ పతాకాలతో దేశభక్తిని చాటిన మగువ లయన్స్ సభ్యులు



కరీంనగర్, ఆగష్టు 14: పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం సందడిగా సాగింది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు చేపట్టిన త్రివర్ణ పతాకాల ర్యాలీ అందరినీ ఆకట్టుకుంది. రామగుండం లయన్స్ క్లబ్ అనుబంధ మగువ లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు అంబటి అర్చన సంతోష్‌రావు ఆధ్వర్యంలో వందలాది మంది సభ్యులు చేతుల్లో జాతీయ జెండాలు పట్టుకుని రెండు కిలోమీటర్ల మేర ర్యాలీ నిర్వహించారు.

స్థానిక యూనివర్సిటీ పీజీ కళాశాల నుంచి గోదావరిఖని ప్రధాన చౌరస్తా వరకు హర్ ఘర్ తిరంగా ప్రదర్శన అట్టహాసంగా సాగింది. ర్యాలీ సందర్భంగా మహిళలు వందేమాతరం నినాదాలతో నగరాన్ని మార్మోగించారు. దారిపొడవునా దేశభక్తి గేయాలతో పాటు సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. చౌరస్తా వద్ద నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో పట్టణ సీఐ ఇంద్రసేనారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రతి ఒక్కరూ దేశభక్తిని చాటుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ రాజేశ్వరరావు, అంబటి అర్చన సంతోష్‌రావు, సోమారపు లావణ్య, భవాని, స్వరూప, శశికళ, గాలి సునీత, వొల్లాల సురేష్, ఎర్ర కొమురయ్య, మహేందర్, కందుల సంధ్యారాణి, అబ్దుల్ షకీల్‌తో పాటు లయన్స్ క్లబ్ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

# విదేశాల్లో ఉద్యోగాల పేరుతో టోకరా.. ముగ్గురు అరెస్ట్

ఆదిలాబాద్, ఆగష్టు 14: విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి లక్షల్లో డబ్బులు వసూలు చేసి మోసాలకు పాల్పడిన ముగ్గురు నిందితులను ఆదిలాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. మావల మండలం కైలాస్‌నగర్‌కు చెందిన చిట్టిపవార్ లావణ్య తన తమ్ముడు రాహుల్‌కు విదేశాల్లోని మంచి కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి రూ.7 లక్షలు డిమాండ్ చేశారని ఫిర్యాదు చేశారు. ముందుగా రూ.3 లక్షలు చెల్లించినా ఉద్యోగం ఇప్పించకుండా పలుమార్లు తిప్పుతూ మాయమాటలతో మోసం చేసినట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మావల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా నిందితులు నకిలీ ప్రామిస్ నోట్, చెక్కులు ఇచ్చి మోసం చేసినట్లు వెల్లడించారు.

ఈ కేసులో ఏ1 మహ్మద్ ఖాజా మొయినుద్దీన్ (28), ఏ2 గోరెమియా (62), ఏ4 బలే శ్రీనివాస్ (47)లను గురువారం అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఏ3 షేక్ యాస్మిన్ అలియాస్ యాస్మిన్ సుల్తానా పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. మావల సీఐ బీడీ ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు కొనసాగుతోందన్నారు. విదేశీ ఉద్యోగాలు, వీసాలు, ప్రయాణాల విషయంలో గుర్తుతెలియని వ్యక్తులను నమ్మి ప్రజలు మోసపోవద్దని డీఎస్పీ సూచించారు. ముందస్తుగా డబ్బులు చెల్లించే ముందు సంబంధిత సంస్థలు, ఏజెన్సీల విశ్వసనీయతను పరిశీలించాలని కోరారు. ఉద్యోగం ఇప్పిస్తామని ఎవరైనా అనుమానాస్పదంగా డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, మోసాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# మత్తు పదార్థాల తయారీకి ఉపయోగించే 30 కిలోల ముడి రసాయనాలతో పాటు, పూర్తి స్థాయి యంత్రాలు, పరికరాలు స్వాధీనం

న్యూఢిల్లీ, ఆగష్టు 14:మాదకద్రవ్యాలు, సైకోట్రోపిక్ పదార్థాల అక్రమ తయారీ, రవాణాలపై చేపట్టిన నిరంతర నిఘాలో భాగంగా డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు మరో రహస్య డ్రగ్స్ తయారీ కేంద్రాన్ని ఛేదించారు. ఉత్తరప్రదేశ లోని గౌతమ్ బుద్ధ నగర్ జిల్లా, జేవార్ ప్రాంతంలోని ఒక నివాస గృహంలో ఈ అక్రమ తయారీ కేంద్రం నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) సేకరించిన పక్కా సమాచారం ఆధారంగా 2026 ఆగస్టు 9, 10 తేదీల్లో చేపట్టిన ఈ ఆపరేషన్‌లో దాదాపు 30 కిలోల ఆంఫెటమైన్/ మధ్యంతర డ్రగ్స్ రూపాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనితో పాటు మాదకద్రవ్యాల తయారీకి వినియోగించే దాదాపు 30 కిలోల ప్రికర్సర్ రసాయనాలు,సైకోట్రోపిక్ పదార్థాల అక్రమ తయారీకి ఉపయోగించే పూర్తి స్థాయి యంత్రాలు, పరికరాలను స్వాధీనం చేసుకున్నారు.

సదరు ప్రాంగణంలో నిర్వహించిన తనిఖీల్లో ఒక పూర్తి స్థాయి రహస్య తయారీ వ్యవస్థ వెలుగు చూసింది. మత్తు కలిగించే పదార్థాల తయారీకి అవసరమైన విద్యుత్ కొలిమిలు, గొట్టాలు, శాస్త్రీయ, కొలతల పరికరాలు, రసాయనాలు,తదితర యంత్రాలు, పనిముట్లు లభ్యమయ్యాయి. వీటితో పాటు వివిధ రకాల ప్రికర్సర్ రసాయనాలు, ముడి పదార్థాలు ఉన్న పలు ద్రవ కంటైనర్లను, వేర్వేరు కంటైనర్లలో నిల్వ ఉంచిన తెల్లటి రంగు పొడి, స్ఫటికాకార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఫీల్డ్ కిట్‌లతో వీటిని పరీక్షించగా.. నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్‌డీపీఎస్) చట్టం 1985 కింద నిషేధించిన ఆంఫెటమైన్ అనే సైకోట్రోపిక్ పదార్థంగా నిర్ధారణ అయ్యింది.

స్వాధీనం చేసుకున్న వస్తువులతో పాటు తయారీ పరికరాలు, ఆ ప్రాంగణంలో లభించిన ఆంఫెటమైన్, రసాయనాలను పరిశీలించగా, 1985 ఎన్‌డీపీఎస్ చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా సైకోట్రోపిక్ పదార్థాలను అక్రమంగా తయారు చేసేందుకు ఈ రహస్య తయారీ కేంద్రాన్ని ఉపయోగిస్తున్నట్లు వెల్లడైంది. ఈ రహస్య కేంద్రాన్ని నిర్వహిస్తున్న ఒక విదేశీ పౌరుడితో పాటు అతని భారతీయ మహిళా సహచరిని 1985 ఎన్‌డీపీఎస్ చట్టం కింద అరెస్టు చేశారు.

ప్రాథమిక దర్యాప్తులో నిందితులు రాత్రి వేళల్లో తయారీ పరికరాలు, ముడి పదార్థాలను ఆ ప్రాంగణానికి తీసుకువచ్చేవారని, అక్కడ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి సుమారు వారం రోజుల పాటు నిర్వహించేవారని తేలింది. అనంతరం పరికరాలను అక్కడి నుంచి తరలించి, ప్రాంగణాన్ని పూర్తిగా శుభ్రం చేసేవారని దర్యాప్తులో వెల్లడైంది. స్థానికులకు అనుమానం రాకుండా ఉండేందుకు రెండు, మూడు నెలల విరామం తర్వాత ఇదే ప్రక్రియను మళ్లీ ప్రారంభించేవారని ప్రాథమిక దర్యాప్తు ద్వారా వెల్లడైంది.

మాదకద్రవ్యాల రహస్య తయారీకి ఉపయోగించే మౌలిక సదుపాయాలను, అక్రమ తయారీ, రవాణాకు సహకరిస్తున్న వ్యవస్థలను పూర్తిగా నిర్వీర్యం చేయడంపై డీఆర్ఐ దృష్టి సారించింది.

# ఆవాల జన్యు వనరుల నుంచి వచ్చిన రూ.15.52 కోట్ల ఏబీఎస్ నిధులను విడుదల చేసిన జాతీయ జీవవైవిధ్య ప్రాధికార సంస్థ

న్యూఢిల్లీ, ఆగష్టు 14:భారతదేశ జీవ వనరులను ఉపయోగించి పది వాణిజ్య రకాల ఆవాల (బ్రాస్సికా జున్సియా) హైబ్రిడ్ వంగడాలను అభివృద్ధి చేసిన ఎంఎస్. పయనీర్ ఓవర్సీస్ కార్పొరేషన్ నుంచి యాక్సెస్, బెనిఫిట్ షేరింగ్ (ఏబీఎస్) ద్వారా రూ.15.52 కోట్ల నిధులను జాతీయ జీవవైవిధ్య ప్రాధికార సంస్థ (ఎన్‌బీఏ) విడుదల చేసింది. ఆవాల సాగు విస్తీర్ణం ఆధారంగా ఈ మొత్తాన్ని 26 రాష్ట్ర జీవవైవిధ్య బోర్డులు (ఎస్ బీబీలు), 3 కేంద్రపాలిత ప్రాంత జీవవైవిధ్య మండళ్ల (యూటీబీసీలు) మధ్య పంపిణీ చేయనున్నారు.

ఈ పది రకాలను ఎంఎస్. పయనీర్ ఓవర్సీస్ కార్పొరేషన్ సంస్థలోనే అభివృద్ధి చేసినా జన్యువులను మాత్రం బహిరంగ మార్కెట్లు, ట్రేడర్ల నుంచి సేకరించింది. వనరులకు సంబంధించి ఏ ఒక్క రైతును, వర్గాన్ని మూలంగా గుర్తించటానికి వీల్లేని సందర్భాల్లో ఏబీఎస్ నిధులను పంపిణీ చేసేందుకు అవసరమైన విధివిధానాలను రూపొందించటానికి నిపుణుల కమిటీని ఎన్‌బీఏ ఏర్పాటు చేసింది.

# మానవులు-ఏనుగుల సంఘర్షణ కేసుల పరిష్కారంలో 'ఘర్షణ నుంచి సహజీవనం వైపు' అనేదే రాష్ట్ర ప్రభుత్వ నినాదం: ఏపీ ఉప ముఖ్యమంత్రి శ్రీ కే పవన్ కల్యాణ్

న్యూ ఢిల్లీ, ఆగష్టు 14:నేడు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో ప్రపంచ ఏనుగుల దినోత్సవం 2026 సందర్భంగా... జాతీయస్థాయి వేడుకలను కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పులశాఖ సహాయ మంత్రి శ్రీ కీర్తి వర్ధన్ సింగ్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పులశాఖ కార్యదర్శి శ్రీ తన్మయ్ కుమార్, అటవీ విభాగం డైరెక్టర్ జనరల్, ప్రత్యేక కార్యదర్శి శ్రీ సుశీల్ కుమార్ అవస్థి, ఏడీజీ (వన్యప్రాణి) శ్రీ రమేష్ పాండేలతో పాటు కేంద్ర మంత్రిత్వశాఖ, ఆంధ్రప్రదేశ్ అటవీశాఖకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు. వీరితో పాటు రైల్వే మంత్రిత్వశాఖ అధికారులు, వివిధ రాష్ట్రాల అటవీ శాఖల ప్రతినిధులు, శాస్త్రీయ పరిశోధనా సంస్థల నిపుణులు, ఇతర భాగస్వామ్య పక్షాలు కూడా ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి శ్రీ కీర్తి వర్ధన్ సింగ్ సదస్సును ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ నాయకత్వంలో భారత్ ఏనుగుల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఏనుగుల ఆవాసాలను రక్షించడానికి, వాటి సుస్థిర భవిష్యత్తు కోసం కృత్రిమ మేధ, రిమోట్ సెన్సింగ్, జియోస్పేషియల్ మ్యాపింగ్ వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సంప్రదాయ జ్ఞానంతో అనుసంధానిస్తున్నట్లు వివరించారు. మనుషులు-ఏనుగుల ఘర్షణను సమర్థవంతంగా తగ్గించడానికి, స్థానిక ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, వివిధ ప్రభుత్వ విభాగాలు పరస్పరం సహకరించుకోవాలని, సమాజ భాగస్వామ్యాన్ని పెంచాలని, శాస్త్రీయ పద్ధతులను అవలంబించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ఏనుగుల సంరక్షణ పట్ల భారత్ చూపుతున్న నిబద్ధత కేవలం విధానపరమైన నిర్ణయం మాత్రమే కాదని, అది మన నాగరికతా విలువలు, పర్యావరణ బాధ్యతలకు ప్రతిబింబమని కేంద్రమంత్రి శ్రీ సింగ్ పేర్కొన్నారు. దేశంలో 33 ఏనుగుల అభయారణ్యాలు, శాస్త్రీయంగా గుర్తించిన 150 ఏనుగుల కారిడార్లు ఉన్నాయని, ప్రపంచంలోని అడవి ఆసియా ఏనుగుల జనాభాలో దాదాపు 60 శాతం భారత్‌లోనే ఉన్నాయని తెలిపారు. ఏనుగుల సంరక్షణలో భారత్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. మనుషుల-ఏనుగుల సంఘర్షణ సంక్లిష్టమైన సమస్య అని, దీనికి వివిధ వర్గాలను భాగస్వామ్యం చేస్తూ, క్షేత్రస్థాయిలో ధ్రువీకరించిన శాస్త్రీయ సమాచారాన్ని వినియోగించి సమన్వయంతో పరిష్కారం కనుగొనాల్సిన అవసరం ఉందని అన్నారు.

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రసంగిస్తూ.. మనుషుల-ఏనుగుల సంఘర్షణ (హెచ్ఈసీ) కేసుల పరిష్కారంలో 'సంఘర్షణ నుంచి సహజీవనం వైపు' అనేది ప్రభుత్వ నినాదామని తెలిపారు. ఇది రాష్ట్రాల పరిపాలనా సరిహద్దులకు అతీతమైన ఉమ్మడి బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. వన్యప్రాణుల రక్షణ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన హనుమాన్ (వన్యప్రాణుల పర్యవేక్షణ, సహాయం, సంరక్షణ కోసం చికిత్స, పోషణ కేంద్రాలు-హెచ్‌ఏఎన్‌యూఎంఏఎన్) కార్యక్రమాన్ని ఈ సందర్భంగా శ్రీ పవన్ కల్యాణ్ ప్రస్తావించారు. రాష్ట్రంలో వన్యప్రాణులను రక్షించడంలో ఆధునిక సాంకేతికతను వినియోగించడంతో పాటు స్థానిక ప్రజలను భాగస్వామ్యం చేస్తున్నామని, క్షేత్రస్థాయిలో పనిచేసే అటవీ సిబ్బంది సామర్థ్యాలను పెంపొందిస్తున్నామని తెలిపారు.

జాతీయ వేడుకల్లో భాగంగా ఏనుగుల సంరక్షణ, నిర్వహణలో విశేష కృషి చేసిన వారికి శ్రీ కీర్తి వర్ధన్ సింగ్ గజ గౌరవ్ అవార్డులు 2026ను ప్రదానం చేశారు.

ఈ కార్యక్రమంలో 2020-2026 కాలంలో ప్రాజెక్టు ఎలిఫెంట్ కింద చేపట్టిన 30 ముఖ్య విజయాలను, ఏనుగుల సంరక్షణ చర్యలను వివరిస్తూ '30 జెయింట్ స్టెప్స్'ను విడుదల చేశారు. 1992లో కేంద్ర ప్రాయోజిత పథకంగా ప్రారంభమైన ప్రాజెక్టు ఎలిఫెంట్ మూడు దశాబ్దాలకు పైగా ఏనుగులు, వాటి ఆవాసాలు, ఏనుగుల కారిడార్ల సంరక్షణతో పాటు మనుషులుఏనుగుల సంఘర్షణను పరిష్కరించడం, మానవ సంరక్షణలో ఉన్న ఏనుగుల సంక్షేమం కోసం కృషి చేస్తోంది.

# నేటి తరానికి ఆదర్శం... కొండా వెంకటప్పయ్య వ్యక్తిత్వం

## ఆగస్టు 15... కొండా వెంకటప్పయ్య వర్ధంతి




ఆయన విలువలతో కూడిన నిబద్ధ త కలిగిన రాజకీయ నాయకుడు. దాన, ధర్మాల కోసం సొంత ఆస్తినే అమ్ముకొన్న దయా హృదయుడు. స్వాతంత్ర్య సమర యోధుడు, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రోద్యమానికి ఆద్యుడు, దేశభక్త బిరుదాంకి తుడు. ఆయనే నిస్వార్ధానికి నిలు వెత్తు రూపం కొండా వెంకటప్పయ్య. దృఢ సంకల్పం, నిర్మలమైన ప్రవర్తన, అసమాన ధైర్యం, నిశ్చల మైన దీక్షా దక్షత, అరమరకలేని అమాయకత్వం, నిరాడంబర వ్యక్తిత్వం కలగలిపినదే కొండా వెంకటప్పయ్య జీవితం. శ్రోత్రియ కుటుంబంలో జన్మించినా, సనాతన సాంప్రదాయాల పరిధిని అతిక్రమిం చిన భిన్న మనస్తత్వం ఆయనది. ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఉద్యమానికి మార్గదర్శకత్వం నెరపిన నాయక త్వం ఆయనది. కృష్ణా పత్రికను స్థాపించి తెల్లదొరలపై అక్షర అస్త్ర శస్త్రాలను సంధించిన అక్షర యోధుడు. గాంధీకే దేశ రాజకీయాల లోకి రాక ముందే ఆంగ్లేయులకు వ్యతిరేకంగా న్యాయవాద వృత్తిని విడనాడి న త్యాగధనుడు.

స్వాతంత్ర్యం వచ్చిన నాలుగు నెలలలో, 1947 డిసెంబరులో కొండా వెంకటప్పయ్య ...స్వాతం త్ర్యం తరువాత పెచ్చుపెరిగిన అవినీతి గురించి మహాత్మా గాంధీకి వ్రాసిన లేఖను బట్టి ఆయన తపన అర్థం అవుతుంది. "మనం మన స్ఫూర్తిగా కోరుకొన్న స్వరాజ్యం అనే ఒకే ఒక లక్ష్యం ప్రజలను మీ వెంట నడిపించింది. ఇప్పుడు ఆ గమ్యం చేరుకోగానే ఈ స్వాతంత్ర్య యోధులలో నీతి నియమాలు అంతరించి పోయాయి. రోజురోజు కూ పరిస్థితి దిగజారి పోతోంది. ప్రజలు కాంగ్రెసును దూషిస్తున్నారు. బ్రిటిషు రాజ్యమే మేలంటున్నారు. ఇప్పుడు స్వతంత్ర దేశంలో కాంగ్రెసు అవినీతికి ఆలవాలమై పోతున్నది. వారిని అదుపు చేయాల్సిన పోలీసు వ్యవస్థ కాంగ్రెసువారి కట్టడి లో ఉండి పోయింది. పైసా ఆదాయం లేని వారు ఇప్పుడు మహా రాజుల లాగా పెద్దపెద్ద కార్లలో తిరుగు తున్నారు. కాంగ్రెసు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తరచూ జోక్యం చేసుకోవడం వలన జిల్లా కలెక్టరులూ, రెవిన్యూ అధికారులూ తమ విధులను సక్రమంగా నిర్వర్తించ లేక పోతున్నారు. ఈ పైరవీ కారుల ప్రభావం దుష్ప్రచారం, భయంతో నిజాయితీగల వారు తమ పదవులలో ఉండే పరిస్థితి లేదు."

విదేశీ పాలకుల దాస్య శృంఖలాల నుండి విముక్తి కలిగి, స్వతంత్ర భారతావని స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్న అనంతరం కేవలం , నాలుగు మాసాలకే 1947 డిసెం బర్‌లో కాంగ్రెస్ నేతల స్వార్థ చింతన గురించి గాంధీజీకి రాసిన లేఖలోని వ్యథా భరిత హృదయంలో నుండి వచ్చిన బాధతో నిండిన వాక్యాలివి. దీన్ని బట్టి ఆయన నీతి నిజాయితీ, నిబద్ధత, నిస్వార్థ భావన గురించి స్పష్టం అవుతుంది.

కొండా వెంకటప్పయ్య (ఫిబ్రవరి 22, 1866 - ఆగష్టు 15, 1949) 1866, ఫిబ్రవరి 22 న పాత గుంటూరులో జన్మించాడు. ప్రాథమిక విద్య గుంటూరు మిషన్ స్కూలులో, ఉన్నత విద్య మద్రాసు క్రైస్తవ కళాశాలలో పూర్తిచేసి తరువాత బి.ఎల్. పట్టా పొంది, బందరులో న్యాయ వాద వృత్తిని చేపట్టాడు.

ఇరవయ్యో శతాబ్ది ఆరంభంలో, జాతిని చైతన్య వంతం చేయడానికి వెంకటప్పయ్య 1902లో వాసు నారాయణరావుతో కలసి కృష్ణా పత్రిక ప్రచురణను ప్రారంభించాడు. 1905 వరకు ఆయనే ఆ పత్రికను నడిపి, గుంటూరులో స్థిరపడగానే దాని సంపాదకత్వ బాధ్యతలను ముట్నూరు కృష్ణారావుకు అప్పగిం చాడు. న్యాయవాద వృత్తిలో వెంకటప్పయ్య ధనార్జన గురించి అయ న పట్టించుకోనే లేదు. దాన, ధర్మాల కోసం సొంత ఆస్తినే అమ్ము కొన్నాడు.

1912 మే నెలలో కృష్ణా గుంటూరు జిల్లా రాజకీయ మహా సభ నిడద వోలులో జరిగింది. ఆ సభలోనే కొండా వెంకటప్పయ్య సలహాపై ఉన్నవ లక్ష్మీనారాయణ మొదలగు యువకులు 11 తెలుగు జిల్లాలతో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయాలనే విషయంలో మంతనా లు జరిపారు. 1913లో అదే స్థాయి లో మహాసభ బాపట్లలో జరిగింది. కొండా వెంకటప్పయ్య సలహా మేరకు మొదటి ఆంధ్ర మహాసభ (ఆంధ్ర) బి.ఎస్.శర్మ అధ్యక్షతన జరిగింది. దేశవ్యాప్త ప్రచారం కోసం ఏర్పడిన బృందంలో కొండా వెంకటప్పయ్యదే ప్రధాన పాత్ర. నెల్లూరులో జరిగిన ఆంధ్ర మహాసభకు ఆయనే అధ్యక్షుడిగా ఉండి ఆంధ్రరాష్ట్ర నిర్మాణానికి నిర్దిష్ట కార్యక్రమం రూపొందించాడు. 1917లో రాజ్యాంగ సంస్కరణల విషయమై పరిశీలనలు జరపడానికి మాంటేగ్ - చమ్స్‌ఫర్డ్ ప్రతినిధి వర్గాన్ని ప్రభుత్వం నియమించింది. సదరు ప్రతినిధి వర్గం మద్రాసుకు వచ్చిన. సందర్భంలో భాషా ప్రాతిపదికన రాష్ట్రాల విభజన అవసరాన్ని. నొక్కి చెప్పిన ఆంధ్ర ప్రతినిధులలో కొండా వెంకటప్పయ్య ముఖ్యుడు.

1918లో ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కమిటీ ఏర్పడింది. రాష్ట్ర సాధనలో ఇది తొలివిజయం కాగా, రాష్ట్ర కాంగ్రెసు కమిటీకి తొలి కార్య దర్శి వెంకటప్పయ్యే. ఆ రోజుల్లో కృష్ణా, గుంటూరు, గోదావరి జిల్లా లు కలసిన నియోజక వర్గం నుంచి పోటీ చేసి కొండా వెంకటప్పయ్య మద్రాసు కౌన్సిలుకు ఎన్నిక య్యాడు. సహాయ నిరాకరణోద్యమం కొనసాగించడానికి వీలుగా కాంగ్రెసు పార్టీ తన సభ్యుల రాజీనామా కోరగానే కొండా శాసన సభ సభ్యత్వానికి రాజీనామా చేశాడు. తర్వాత ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షుడై భారత జాతీయ కాంగ్రెస్ సభ్యుడయ్యాడు.

1921 మార్చి 31, ఏప్రిల్ 1 తేదీలలో అఖిల భారత కాంగ్రెస్ మహాసభలు బెజవాడలో జరిగగా, మహాత్ముని ఆంధ్ర పర్యటన వెంకటప్పయ్య ఆధ్వర్యంలోనే జరిగింది. వేలాది రూపాయల విరాళాలుగా స్వీకరించి స్వరాజ్య నిధికి సమర్పించాడు. పెదనంది పాడు పన్నుల నిరాకరణోద్యంలో పాల్గొన్నందుకు ఆయన మొదటి సారి జైలు శిక్ష అనుభవించాడు.

1923లో కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన దేశబంధు చిత్తరంజన్ దాస్ రాజీనామా వల్ల వెంకటప్ప య్యను అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. దుగ్గి రాల గోపాలకృష్ణయ్య అఖిల భారత కాంగ్రెస్ కార్యదర్శి అయ్యా డు. గాంధీజీ తలపెట్టిన ప్రతి ఉద్యమానికి ఆంధ్రలో కొండా వెంక టప్పయ్యే ఆ రోజుల్లో నాయకత్వం వహించేవాడు. ఆంధ్ర ఖద్దరుకు యావద్దేశ ప్రచారం లభించడానికి కొండా వెంకటప్పయ్య కృషి ప్రధాన మైనది.

1933లో మహాత్ముడు ఆంధ్రలో హరిజన యాత్ర చేపట్టి, అనేక గ్రామాలలో హరిజనుల దేవాలయ ప్రవేశం చేయించాడు. భార్య మృత్యు ఒడిలో ఉన్నప్పటికీ కొండా వెంకటప్పయ్య హరిజన సేవలో నిమగ్నుడై తిరుగుతున్నాడని మహాత్మాగాంధీచేత కొనియాడ బడినాడు.

1929లో సైమన్ కమిషన్ రాక సందర్భంలో, 1930లో ఉప్పు సత్యాగ్రహంలో, 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నందుకు కొండా వెంకట ప్పయ్య జైలు శిక్షలు అనుభవిం చాడు. 1937లో జరిగిన ఎన్నికల్లో అతను మద్రాసు శాసన సభకు ఎన్నికయ్యాడు. భాషా ప్రాతిపదికన మద్రాసు రాష్ట్రాన్ని ఆంధ్ర, తమిళ, కర్ణాటక, కేరళ రాష్ట్రాలుగా విభజిం చాలని కొండా వెంకటప్పయ్య శాసన సభలో ప్రవేశ పెట్టిన తీర్మానం ఏకగ్రీవంగా నెగ్గింది.

ఆంధ్ర రాష్ట్ర ఉద్యమంలో 1920 నుండి 1949లో మరణించే వరకు ఆంధ్ర దేశమే తానుగా వ్యవహరించి ఆంధ్రుల అభిమానానికి పాత్రుడైన గొప్ప వ్యక్తి వెంకటప్పయ్య.

ఆంధ్ర రాష్ట్ర హిందీ ప్రచార సభకు కూడా అధ్యక్షుడిగా పని చేశాడు. అఖిల భారత చరఖా సంఘానికి జీవిత కాలం సభ్యుడిగా ఉన్నాడు. గ్రంథాలయోద్యమానికి తోడ్పడ్డాడు. దేశ, రాష్ట్ర రాజకీయాలలో, కాంగ్రెస్ పార్టీ లో తమకంటూ ప్రత్యేక స్థానం ఉన్న కొండా, స్వార్థ రాజకీయ నాయకుల మూలంగా తన ప్రతిభకు, త్యాగానికి సముచిత స్థానం పొందలేక పోయాడు.

కొండా వెంకటప్పయ్య 1949 ఆగష్టు 15 న దేశ స్వాతంత్ర్య దినాన లోకాన్ని ఈ వదిలి వెళ్లాడు.

ఆయన వ్యక్తిత్వం నేటి తరానికి ఆదర్శం కావాలి.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# ఆలయాల అభివృద్ధికి కృషి..



వరంగల్, ఆగష్టు 14:వర్ధన్నపేట నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. శుక్రవారం కడిపికొండలోని శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయ పునర్నిర్మాణ పనుల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

ఆలయంలో జరుగుతున్న మూలవిరాట్ విగ్రహ జీర్ణోద్ధరణ పూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును శాలువాలతో సత్కరించి స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి ఆలయం భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా, గ్రామ ప్రజల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తామని చెప్పారు. భక్తుల సౌకర్యాలను మరింత పెంచేందుకు ఆలయ కమిటీ సభ్యులు కృషి చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో 45వ డివిజన్ అధ్యక్షుడు కర్ర హరీష్‌రెడ్డి, 44వ డివిజన్ అధ్యక్షుడు సదానందం యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ పీఏసీఎస్ వైస్ చైర్మన్ గంగుల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ బస్కె శ్రీలేఖ, మాజీ డివిజన్ అధ్యక్షుడు సట్ల సదానందం, సోషల్ మీడియా కోఆర్డినేటర్ సతీష్, యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ ప్రణయ్, మండల పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంద రమేష్, సీనియర్ నాయకులు కోటేశ్వర్, ఎడ్ల రాజమల్లారెడ్డి, మహిళా నాయకులు నీలం రజిని, ప్రశాంతి, కాయితే కవిత, డివిజన్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

# రాజమహేంద్రవరం డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం



వరంగల్, ఆగష్టు 14: నగరంలో దశాబ్దాలుగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న కంపోస్ట్ యార్డు, చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే దిశగా చర్యలు వేగవంతమయ్యాయని ఎమ్మెల్యే ఆదిరెడ్డి అన్నారు. శుక్రవారం పురపాలక శాఖ మంత్రి నారాయణ, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మున్సిపల్ అధికారులతో కలిసి పేపర్ మిల్లు ఎదురుగా ఉన్న డంపింగ్ యార్డుతో పాటు క్వారీ ప్రాంతంలోని లెగసీ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌ను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ.. రత్నంపేట, లూథర్ గిరి, ఆర్అండ్‌బీ కాలనీ ప్రాంతాల ప్రజలు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న కంపోస్ట్ యార్డు సమస్యకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, మంత్రి నారాయణ సారథ్యంలో శాశ్వత పరిష్కారం లభిస్తోందన్నారు.

పెద్దాపురంలో నిర్మాణంలో ఉన్న 'వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్ పూర్తయిన తర్వాత రాజమహేంద్రవరం నగరంలోని చెత్త సమస్యకు మరింత సమర్థవంతమైన పరిష్కారం లభిస్తుందని తెలిపారు. రాష్ట్రాన్ని డంపింగ్ యార్డుల రహితంగా మార్చే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఘన వ్యర్థాల ప్రాసెసింగ్‌ను వేగవంతం చేస్తోందన్నారు.

రాబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని రాజమహేంద్రవరం నగరాన్ని స్వచ్ఛమైన, సుందరమైన నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు.

# మల్లన్నగండి నుంచి సాగునీటి విడుదల..

## -విడుదల చేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి



వరంగల్, ఆగష్టు 14:చిలుపూర్, స్టేషన్ ఘనపూర్ మండలాల పరిధిలోని మల్లన్న గండి రిజర్వాయర్ కుడి కాలువ ద్వారా మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పంట కాలువలకు నీటి పారుదల శాఖ అధికారులు, రెండు మండలాల ప్రజా ప్రతినిధులు, రైతులతో కలిసి సాగు నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా రిజర్వాయర్ లోని గోదావరి జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి పసుపు కుంకుమలు సమర్పించారు. స్వయంగా కుడి కాలువ గేట్లు లేపి నీటిని విడుదల చేశారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత కరువు పరిస్థితులలో దేవాదుల ఎత్తిపోతల పథకం ఉమ్మడి వరంగల్ జిల్లాకు వరప్రదాయనిగా మారిందని తెలిపారు. ధర్మసాగర్, ఘనపూర్, మల్లన్న గండి, అశ్వరావుపల్లి, నవాబ్ పేట తో పాటు బొమ్మకూరు, చిటకోడూరు రిజర్వాయర్ ద్వారా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాలకు సాధ్యమైనంత వరకు సాగు నీరు అందించే ప్రయత్నం చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలోని ఏ ప్రాజెక్టు నుండి కూడా సాగు నీరు విడుదల చేయడం లేదని కేవలం దేవాదుల ప్రాజెక్ట్ నుండి మాత్రమే పంటలకు సాగు నీరు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

నెల రోజుల నుండి ప్రతీ రోజు దేవాదుల మోటార్ల ద్వారా పంపింగ్ పరిశీలిస్తూ అధికారులతో సమన్వయం చేసుకుంటూ రిజర్వాయర్లలో నీటిని నింపడం వల్లే ప్రస్తుతం సాగు నీటి విడుదల సాధ్యం అయిందని అన్నారు. రిజర్వాయర్లలో 50శాతం వరకు నీటి నిలువలు ఉన్నాయని కావున ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో సాగు నీటి విడుదల చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. 15రోజుల పాటు నీటి విడుదల చేసి మరో 15రోజులు రిజర్వాయర్లలో నీటిని నింపడం జరుగుతుందని వెల్లడించారు.

పంట కాలువల ద్వారా వచ్చే నీటిని రైతులు పొదుపుగా వాడుకొని పంటలను కాపాడుకోవాలని సూచించారు. ఆరుతడి పంటలు, ఇప్పటికే నాట్లు పూర్తి చేసి సాగు చేసుకున్న వరి పొలాలకు మాత్రమే నీటి వినియోగించుకోవాలని కొత్తగా వరి నాట్లు వేసి ఇబ్బందులు పడవద్దని విజ్ఞప్తి చేశారు. కాలువల ద్వారా వచ్చే నీటిని నిరూపయోగం కాకుండా ప్రజా ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు సమన్వయం చేసుకొని కాలువల వెంట పర్యవేక్షించాలని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతీ ఎకరాకు సాగు నీరు అందించి పంటలను కాపాడటమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం లో మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, రాపోలు మధుసూదన్ రెడ్డి, బేతి జైపాల్ రెడ్డి, సింగిల్ విండో చైర్మెన్ నరెందర్ రెడ్డి, సర్పంచ్ లు సుజన, లక్ష్మి, చిల్పూర్, ఘనపూర్ మండలాల వివిధ గ్రామాల సర్పంచులు, నీటి పారుదల శాఖ అధికారులు, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సు టైరు పేలి మహిళకు గాయాలు

మహబూబ్‌నగర్, ఆగష్టు 14:ఆర్టీసీ బస్సు టైరు పేలిన ఘటనలో ఓ మహిళకు గాయాలయ్యాయి.

నారాయణ పేట డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాదు నుంచి నారాయణపేటకు వస్తుండగా మరికల్ మండల కేంద్రంలోని పెద్ద చెరువు వద్ద టైర్ పేలి హైదరాబాద్ కు చెందిన మాధవి (36) కాలుకు బలమైన దెబ్బ తగిలింది. మాధవి భర్త సంతోష్ కుమార్(39) కు స్వల్పంగా గాయపడ్డారు.

ఆర్టీసీ సిబ్బందితోపాటు ప్రయాణికులు 108కు సమాచారం ఇవ్వడంతో వారిని అంబులెన్స్ లో జిల్లా ఆసుపత్రికి తరలించారు. బస్సులో 65 మంది ఉన్నట్లు సిబ్బంది తెలిపారు. క్షతగాత్రులు బడ్డేపల్లిలో తమ బంధువులు మృతి చెందడంతో అంతక్రియలకు వెళ్తుండగా ఘటన జరిగింది .

# 'సాగునీరు ఇవ్వకపోతే రైతుల తిరుగుబాటు తప్పదు'

## -మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు



నల్గొండ, ఆగష్టు 14:: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుండి ఎడమ కాల్వకు వానాకాలం సాగునీటిని వెంటనే విడుదల చేయాలని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురిసి అన్ని డ్యాంలు నిండుగా ఉన్నాయని, శ్రీశైలం ప్రాజెక్టులో 872 అడుగుల నీరు ఉందని, మరో ఏడు అడుగులు అయితే ప్రాజెక్టు నిండుతుందని, ఈ దశలో అక్కడ విద్యుత్ తయారు చేసి సాగర్ ప్రాజెక్టుకు వదిలినట్లయితే ఆ నీటితో ఎడమ కాల్వకు రెండు పంటలకు నీటి విడుదల చేయవచ్చన్నారు. అదే విధంగా తాగునీటికి కూడా కొరత ఉండదని తెలిపారు. నీటి పారుదల శాఖ మంత్రి జిల్లాకు చెందిన ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నా కూడా నీటి విడుదలపై నోరు మెదపడం లేదని, అదే ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, భట్టి విక్రమార్కతోపాటు నల్లగొండ జిల్లా ఆయకట్టు పరిధిలో ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు జైవీర్‌రెడ్డి, బీఎల్ఆర్, పద్మావతి ఉన్నారని, సాగునీటిపై వీరు ప్రభుత్వాన్ని నిలదీసే పరిస్థితి లేకుండా పోయిందన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎల్‌నినో ఏర్పడింది, నీటి కొరత ఉంటుందని అవగాహన లేకుండా శ్రీశైలం ప్రాజెక్టులో విద్యుత్ తయారీని నిలిపి వేశారని, ప్రతిపక్ష నాయకులు ప్రశ్నించిన సందర్భంలోనే శ్రీశైలం ప్రాజెక్టు నుండి విద్యుత్ తయారు చేసి నాగార్జునసాగర్‌కు నీటి విడుదల చేశారని తెలిపారు. శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణ దశలోనే కేవలం విద్యుత్ తయారీ, నీటి నిల్వ కోసమే ఏర్పాటు చేశారని, దీన్ని దృష్టిలో ఉంచుకుని నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు నీటి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో శ్రీశైలం ప్రాజెక్టు నీటిని పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా అక్రమంగా నీటిని తరలిస్తున్నారని, ఈ విషయాన్ని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ప్రత్యక్షంగా పరిశీలించారని తెలిపారు. అక్రమ నీటి తరలింపుపై ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు సోయి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

నీటి విడుదల విషయంలో నిర్లక్ష్యం చేస్తే రైతుల ఆగ్రహానికి ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి సాగునీటి విడుదలపై సలహాలు స్వీకరించి రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నీటి విడుదల చేయనట్లయితే రైతులతో కలిసి ఛలో సాగర్ కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్ డ్డి, హాతీరాం, అన్నభీమోజు నాగార్జునచారి, నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, పడిగపాటి కోటిరెడ్డి, ఎండి. యూసుఫ్, ఇలియాస్, పాచ్చునాయక్, వినోద్, రవీందర్, షోయబ్, పద్మావతి, రమాదేవి ఉన్నారు.

# ఢిల్లీ ఎయిమ్స్‌లో చేరిన కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా

న్యూ ఢిల్లీ, ఆగష్టు 14: కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా గురువారం ఢిల్లీ ఎయిమ్స్ ఆస్పత్రిలో చేరారు. గురువారం ఆయన అస్వస్థతకు గురి కావడంతో కుటుంబ సభ్యులు ఆయనను ఢిల్లీ ఎయిమ్స్‌లో చేర్చారు. ప్రస్తుతం ఆయన వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. జేపీ నడ్డా వయసు 65. ఈ నేపథ్యంలో ఆయనకు ఢిల్లీ ఎయిమ్స్ వైద్యులు అనేక రకాల పరీక్షలు నిర్వహించారు. వాటిలో కరోనరీ యాంజియోగ్రఫీ పరీక్ష కూడా ఉంది.

ప్రస్తుతం జేపీ నడ్డా ఆరోగ్యం నిలకడగా ఉందని, కార్డియాలజీ వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని ఆస్పత్రివర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. గురువారం సాయంత్రం ఆయన ఆస్పత్రిలో చేరినట్లు వెల్లడించాయి. అయితే, ఆయనకు గల అనారోగ్య సమస్యకు సంబంధించిన వివరాల్ని మాత్రం వివరించలేదు. సాధారణంగా గుండె రక్త నాళాల్లో ఏదైనా సమస్య, అడ్డంకి ఉందా అని తెలుసుకునేందుకు వైద్యులు కరోనరీ యాంజియోగ్రఫీ పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో ఏదైనా సమస్య తలెత్తితే అవసరమైన శస్త్ర చికిత్స చేయాల్సి ఉంటుంది. జేపీ నడ్డా గతంలో బీజేపీ జాతీయాధ్యక్షుడిగా పని చేశారు.

ఆ తర్వాత ఆయన కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. దీంతో బీజేపీ జాతీయాధ్యక్షుడిగా నితిన్ నబిన్ చేపట్టారు. మోదీ క్యాబినెట్‌లో నడ్డా కీలకంగా ఉన్నారు. మోదీ, అమిత్ షాలకు అత్యంత సన్నిహితుడు. ఇదే సమయంలో పార్టీని జాతీయ స్థాయిలో బలోపేతం చేసిన నేతగానే కాకుండా, వివిధ రాష్ట్రాల్లో అధికారంలోకి తెచ్చిన నాయకుడిగానూ నడ్డాకు పేరుంది.

# జయహో ! "వందేమాతరం"

## ప్రస్తావన :

ఈ ఏడాది ఆగస్టు 15న జరగనున్న భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు "యువ శక్తి" మరియు "వందేమాతరం 150 ఏళ్లు" స్ఫూర్తిని చాటిచెప్పే అంశాల చుట్టూ సాగుతా యన్నది గమనార్హం. స్వాతంత్ర్య స్ఫూర్తికి అసలైన శక్తి, వందేమాతరం. 80వ స్వాతంత్ర్య దినోత్సవం స్వాతంత్ర్య స్ఫూర్తి కీలకమైన భవిష్యత్ లక్ష్యాన్ని గుర్తు చేస్తోంది. స్వాతంత్ర్యం సాధించడం ఒక చారిత్రక విజయమైతే, యువ శక్తిపై దృష్టి, దేశాభివృద్ధిలో భారతీయ యువత మరియు యువ ఆవిష్కర్తల పాత్రను, వారి విజయాలను ప్రదర్శించడం. వందేమాతరం మైలురాయి. చరిత్రలో మొదటిసారిగా, జాతీయ గీతం 'వందేమాతరం' ఎర్రకోట ప్రాకారం నుండి ప్రత్యక్షంగా ఆలపించబడు తుంది. ప్రత్యేక అతిథులు, యువ విజేతలు, విద్యార్థులు మరియు అంతర్జాతీయ ఒలింపియాడ్ పతక విజేతలతో సహా సుమారు 5,000 మంది ప్రత్యేక అతిథులు ఈ వేడుకకు ఆహ్వానించబడ్డారు.

అదే విధంగా యావత్ భారత దేశంలోని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, తెలుగు రాష్ట్రాలు తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ 80 వ స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు జరుపుకునేందుకు సమాయాత్తం అవుతున్నాయి.

## వందేమాతరం :

"వందేమాతరం" అనే మహోన్నత నినాదం వెనుక భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న భారత జాతి త్యాగం ఉంది. స్వేచ్ఛ కోసం ప్రాణాలను అర్పించిన అమరవీరుల స్ఫూర్తి ఉంది. బ్రిటిష్ పాలన దాదాపు రెండు శతాబ్దాల పాటు భారతదేశ రాజకీయ, ఆర్థిక వ్యవస్థలను ప్రభావితం చేసింది. 1857 తిరుగుబాటు నుంచి భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావం వరకు, మహాత్మాగాంధీ నాయకత్వంలోని సత్యాగ్రహం, సహాయ నిరాకరణ, శాసనోల్లం ఘన ఉద్యమాల నుంచి 1942 క్విట్ ఇండియాఉద్యమం వరకు స్వాతంత్ర్య సమరం అనేక విధాలుగా సాగింది. గాంధీజీ అహింసా మార్గంతో పాటు భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ వంటి విప్లవ వీరుల త్యాగాలు కూడా జాతీయోద్యమానికి అపారమైన స్ఫూర్తినిచ్చాయి. బాల గంగాధర్ తిలక్, సర్దార్ వల్లభభాయ్ పటేల్, సరోజినీ నాయుడు, జవహర్‌లాల్ నెహ్రూ తమదైన పాత్రను పోషించారు. వేలాది మంది విప్లవ వీరుల త్యాగాల ఫలితంగానే భారత దేశానికి స్వాతంత్ర్యం లభించింది. 1947, ఆగస్టు 15 చరిత్రను మార్చిన అర్ధరాత్రి. 1947లో బ్రిటిష్ పార్లమెంట్ ఇండియన్ ఇండిపెండెన్స్ యాక్ట్‌ను ఆమోదించింది. దాని ఫలితంగా భారతదేశం పాకిస్తాన్ అనే రెండు స్వతంత్ర డొమినియన్లు ఏర్పడ్డాయి. ఆగస్టు 14-15 మధ్య అర్ధరాత్రి అధికార బదిలీ జరిగింది. ఆ క్షణం నుంచి భారత్ ఒక స్వతంత్ర దేశంగా తన కొత్త ప్రయాణాన్ని ప్రారంభించింది. అందుకే ప్రతి సంవత్సరం ఆగస్టు 15న జాతీయ పతాకాన్ని ఎగురవేస్తూ, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశాభివృద్ధికి మన వంతు కర్తవ్యాన్ని పునరుద్ఘాటించుకుంటాం.

## మొట్టమొదటి భారతదేశ స్వాతంత్ర్య దినోత్సవం వేడుక :

1947 ఆగస్టు, 15. అర్ధరాత్రి స్వాతంత్ర్యం వచ్చింది. ఆ నాడు యావత్ భారతావనికి స్వాతంత్ర్యం సాధించిన శుభదినం 15, ఆగస్టు 1947న, లార్డ్ మౌంట్ బాటన్ బ్రిటిష్ ఇండియాను రెండు కొత్త స్వతంత్ర దేశాలుగా విభజించాడు. భారతదేశం మరియు పాకిస్తాన్. ఇది 1947లో జవహర్ లాల్ నెహ్రూ తన చారిత్రక ప్రసంగం 'ట్రిస్ట్ విత్ డెస్టినీ'ని ఆగస్టు 14న అర్ధరాత్రి వైస్రాయ్ లాంజ్ (ప్రస్తుత రాష్ట్రపతి భవన్) నుంచి ఇచ్చారు. నెహ్రూ అప్పటికి ప్రధానమంత్రి కాలేదు. ఆయన ప్రసంగాన్ని ప్రపంచమంతా విన్నది. మొదటి భారత



స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్టు 15, 1947న భారతదేశానికి స్వాతంత్ర్యం వస్తుందనే విషయం తెలియగానే జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభ్ భాయి పటేల్ మహాత్మాగాంధీకి లేఖ రాశారు. అందులో ఆగస్టు 15 మొదటి స్వతంత్ర దినోత్సవం. మీరు జాతిపిత, మీరు పాల్గొని మీ ఆశీస్సులు అందించండి అని కోరారు. స్వాతంత్రోద్యమానికి మహాత్మా గాంధీ నేతృత్వం వహించారు, కానీ, ఆ సంబరాలలో మహాత్మా గాంధీ పాల్గొనలేదు. భారతదేశం అంతటా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అంబరాన్ని అంటే సంబరాలు జరుపుకున్నారు. నాడు ప్రజలంతా ఈ రోజున, భారతదేశ జాతీయ జెండా బహిరంగ ప్రదేశాలలో ఎగురవేసి. ఈ చారిత్రక ఘట్టాన్ని స్మరించుకునేందుకు గాను ఆ రోజున ఢిల్లీలోని ఎర్రకోట వద్ద మొట్ట మొదటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ధ్వజారోహణ కార్యక్రమంతో పాటు కవాతు, జానపద నృత్య ప్రదర్శనలు కూడా జరిగాయి. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఆనందోత్సాహాలతో ఉత్సవాలు జరుపుకున్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల లక్ష్యం:

ఆగస్టు 15, 1947 బ్రిటిష్ పాలన నుంచి భారతదేశానికి స్వాతంత్ర్యం లభించిన రోజు. అందువల్ల స్వాతంత్ర్య దినోత్సవం మన స్వేచ్ఛకు ప్రతీక. ఎర్రకోటపై జాతీయ వేడుకలు న్యూఢిల్లీలోని ఎర్రకోట స్వాతంత్ర్య దినోత్సవ జాతీయ వేడుకలకు ప్రధాన వేదికగా నిలుస్తోంది. ప్రధానమంత్రి జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. జాతీయ గీతం, సైనిక గౌరవ వందనం, సంప్రదాయం 21 తుపాకుల వందనం, సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థుల ప్రదర్శనలు వంటి కార్యక్రమాలు దేశభక్తి భావాన్ని మరింత ఉజ్వలంగా చేస్తాయి. అభివృద్ధి అంటే కేవలం ఆర్థిక వృద్ధి కాదు. ప్రకృతిని కాపాడుతూ అభివృద్ధి సాధించడమే నిజమైన అభివృద్ధి. సౌరశక్తి, పునరుత్పాదక ఇంధనం, గ్రీన్ హైడ్రోజన్, ఇంధన పొదుపు, పర్యావరణహిత జీవన విధానాలు, Mission Life వంటి కార్యక్రమాలు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన భారతాన్ని అందించడంలో కీలకమైనవి. ఆత్మనిర్భరత, స్వదేశీ సాంకేతికత, పరిశోధన, పారిశ్రామిక అభివృద్ధి, వ్యవసాయ పరిశోధన, పర్యావరణ పరిరక్షణ, మహిళా సాధికారత, యువతకు అవకాశాలు . స్వయం సమృద్ధి వైపు అడుగు. ప్రపంచం కోసం" అనే స్థాయికి మన యువత, పరిశోధకులు, పారిశ్రామికవేత్తలు ఎదగాలి. విద్యార్థులు, శాస్త్రవేత్తలు, స్టార్టప్ వ్యవస్థాపకులు, రైతులు, క్రీడాకారులు, కళాకారులు, సాంకేతిక నిపుణులు - ప్రతి యువకుడు, ప్రతి యువతి దేశ నిర్మాణంలో భాగస్వామి కావాలి. ఉద్యోగం కోసం ఎదురు చూడటమే కాకుండా ఉద్యోగాలను సృష్టించే స్థాయికి యువత ఎదగాలి. ఆవిష్కరణ, పరిశోధన, నైపుణ్యం, పారిశ్రామిక, సామాజిక సేవ - ఇవే కొత్త భారత నిర్మాణానికి యువత అందించిన గొప్ప కానుకలు. దేశ భద్రత నుంచి సాంకేతిక రంగం వరకు భారతదేశం తన సామర్థ్యాలను మరింత పెంచుకోవాల్సిన అవసరం ఉంది. కృత్రిమ మేధస్సు, సెమీకండక్టర్లు, టెలికమ్యూనికేషన్స్, అంతరిక్ష పరిశోధన, రక్షణ రంగం వంటి వ్యూహాత్మక రంగాల్లో స్వదేశీ సాంకేతిక నిక్షేపాలు పెంపొందించడం భవిష్యత్ భారతానికి బలమైన పునాది. స్వాతంత్ర్యం అంటే బాధ్యత కూడా స్వాతంత్ర్యాన్ని మనం కేవలం జాతీయ పతాకం ఎగురవేయడంలో, దేశభక్తి గీతాలు పాడటంలో మాత్రమే పరిమితం చేయకూడదు. చట్టాన్ని గౌరవించడం, ప్రజా ఆస్తిని కాపాడటం, పర్యావరణాన్ని పరిరక్షించడం, అవినీతికి దూరంగాఉండటం, ఇతరుల హక్కులను గౌరవించడం, మహిళలకు సమాన గౌరవం ఇవ్వడం, సామాజిక సామరస్యాన్ని కాపాడటం. ఇవన్నీ నిజమైన దేశభక్తి లక్షణాలు. దేశం మనకు ఏమిచ్చిందని అడగడం కన్నా, దేశానికి మనం ఏమిచ్చామనే ప్రశ్నే స్వాతంత్ర్య స్ఫూర్తికి అసలైన కొలమానం వందేమాతరం. వందేమా తరం నుంచి ఆగస్టు 15, 1947 స్వాతంత్ర్యం సిద్ధించే వరకు 1947, ఆగస్టు 15, 1947 నుంచి వికసిత భారత్ వరకు ఆగస్టు 15, 2047 వరకు స్వాతంత్ర్య ఫలాలను ప్రతి పౌరుడికి సమానంగా అందించడం నేటితరం బాధ్యత. "స్వాతంత్ర్యాన్ని గౌరవించడం, భవిష్యత్తుకు స్ఫూర్తినివ్వడం" (Honouring Freedom, Inspiring the Future) అనేది ఈ వేడుకల ప్రధాన నినాదం; ఇది 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశం (వికసిత్ భారత్) అనే లక్ష్యం దిశగా పయనం. లభించిన స్వాతంత్ర్యాన్ని మన తరం, భవిష్యత్ తరాలకు సమృద్ధి, సమానత్వం, శాంతి, సుస్థిరత అందించాలి.

80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, జాతీయ సమైక్యతను బలపరుస్తూ, విజ్ఞానం, సాంకేతికత, మానవతా విలువల సమన్వయంతో 2047 నాటికి వికసిత భారత నిర్మాణం వైపు ప్రతి పౌరుడు తన అడుగు వేయాలి. "స్వాతంత్ర్య సమరయోధుల త్యాగఫలం...

వికసిత భారత్ యువతరానికి సంకల్పం...

జై హింద్!
వందేమాతరం!



-శారద శృంగేరి
9490261119

## నవంబర్లో సీపీహెచ్ఐ & పీఎంఈసీ ఇండియా 2026




హైదరాబాద్, ఆగస్టు 14: భారత ఫార్మా రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో ప్రతిష్టాత్మక 'సీపీహెచ్ఐ & పీఎంఈసీ ఇండియా 2026'ను రెండు వేర్వేరు వేదికలపై నవంబర్లో నిర్వహించనున్నారు. దేశంలోనే అత్యంత కీలకమైన లైఫ్ సైన్సెస్ హబ్‌లలో తెలంగాణ ఒకటి. ఈ నేపథ్యంలో సీనియర్ ఫార్మా, లైఫ్ సైన్సెస్ నాయకులు హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. భారతదేశం 2030 నాటికి 50 బిలియన్ డాలర్ల ఫార్మా ఎగుమతులను లక్ష్యంగా పెట్టుకోవడం, ఈ రంగం 2030 నాటికి సుమారు 130 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేస్తుండటంతో దాని సామర్థ్యాన్ని, ప్రమాణాలను అంతర్జాతీయ భాగస్వామ్యాలను బలోపేతం చేసుకోవాల్సిన అవసరంతో పాటు మునుపెన్నడూ లేని భారీ అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయి. ఈ సందర్భంగా ఇన్ఫార్మా మార్కెట్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ యోగేష్ ముద్రాస్ మాట్లాడుతూ భారత ఫార్మాస్యూటికల్ రంగానికి ఇది ఒక కీలకమైన దశాబ్దం కానుందన్నారు. సైన్స్, నైపుణ్యం, తయారీ రంగాల్లో భారతదేశానికి ఉన్న బలాలు పరిశోధన, అభివృద్ధి, కాంట్రాక్ట్ సేవలలో మరింత విలువైన అవకాశాలుగా మారుతున్నాయని చెప్పారు. భారత సీఆర్డీఎంఓ పరిశ్రమ 2028 నాటికి సుమారు 14 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని, 2030 నాటికి 22 బిలియన్ డాలర్ల వరకు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారన్నారు. ఈ అవకాశాలను సాధించడం అనేది పరిశ్రమ నాణ్యత, సాంకేతికత, సామర్థ్యం, అంతర్జాతీయ భాగస్వామ్యాలను ఎంత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తుందనే దానిపై ఆధారపడి ఉంటుందన్నారు.

ఈ సంవత్సరం నుంచి ప్రత్యేకమైన దృక్పథంతో వస్తున్న సీపీహెచ్ఐ & పీఎంఈసీ ఇండియా ఈ అవకాశాలను సుదీర్ఘ కాల పరిమితి కలిగిన వృద్ధిగా, అంతర్జాతీయ ప్రాముఖ్యతగా మార్చడంలో సహాయపడే నిర్ణయాధికారులను, భాగస్వాములను ఒకే వేదిక పైకి తెస్తూ ఈ చర్చలకు ఒక ముఖ్యమైన వేదికను అందిస్తోందన్నారు. ఈ సందర్భంగా ఇన్ఫార్మా మార్కెట్స్ ఇండియా సీనియర్ గ్రూప్ డైరెక్టర్ రాహుల్ దేశ్‌పాండే మాట్లాడుతూ భారత ఫార్మాస్యూటికల్ రంగంలో తెలంగాణలు ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందన్నారు. దేశ ఫార్మా ఉత్పత్తులలో తెలంగాణ వాటా దాదాపు 40 శాతం కాగా, ప్రపంచ వ్యాక్సిన్ ఉత్పత్తిలో ఇది సుమారు మూడో వంతు భాగస్వామ్యాన్ని కలిగి ఉందని తెలిపారు.

## జడ్పీ పాఠశాలలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆకస్మిక తనిఖీ

అమరావతి, ఆగస్టు 14: మండలంలోని నల్లపురెడ్డిపల్లె ప్రభుత్వ జడ్పీ పాఠశాలను మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, సహచర మంత్రి ఎస్. సవిత, టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి, జిల్లా టీడీపీ అధ్యక్షులు భూపేష్ రెడ్డితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడి విద్యాబోధన, సిలబస్ పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలలోని ప్లేగ్రౌండ్ అభివృద్ధి, బోర్‌వెల్‌కు మోటార్ ఏర్పాటు, పైప్ కనెక్షన్లు, హాస్టల్‌లో ఓపెన్ డార్మిటరీ వంటి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కిచెన్‌ను పరిశీలించిన మంత్రి.. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని సూచించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం రుచి చూశారు.

విద్యారంగంలో మంత్రి నారా లోకేష్ విప్లవాత్మక మార్పులు తీసుకొస్తూ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతున్నారని బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు.

## ముగిసిన రెండు రోజుల ఐసీఎంఆర్-షైన్ 2026 సదస్సు..

న్యూఢిల్లీ, ఆగస్టు 14:కేంద్ర వైద్య పరిశోధన విభాగం- భారత వైద్య పరిశోధనా మండలి (డీహెచ్ఆర్-ఐసీఎంఆర్) సంయుక్తంగా చేపట్టిన ఐసీఎంఆర్-షైన్ (సైన్స్, హెల్త్ ఇన్నోవేషన్ ఫర్ ది నెక్స్ట్‌జెన్ ఎక్స్‌ప్లోరర్స్) రెండో విడతను 2026 ఆగస్టు 11, 12 తేదీల్లో దేశవ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించారు. బయోమెడికల్, ప్రజారోగ్య పరిశోధనల రంగాన్ని పాఠశాల విద్యార్థులకు మరింత దగ్గర చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. "ఒక్క రోజు శాస్త్రవేత్తగా గడపండి" అనే ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపును ముందుకు తీసుకెళ్తూ.. దేశవ్యాప్తంగా 9 నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం ఐసీఎంఆర్ పరిశోధనాశాలల తలుపులను తెరిచారు. ప్రజారోగ్యం వెనుక ఉన్న శాస్త్రీయ విజ్ఞానాన్ని స్వయంగా వీక్షించడానికి, అనుభవించడానికి, శాస్త్రవేత్తలతో నేరుగా సంభాషించడానికి ఈ జాతీయ స్థాయి అవగాహన కార్యక్రమం ఒక గొప్ప అవకాశాన్ని కల్పించింది.

దేశంలోని 31 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 83 ప్రత్యేక వేదికల్లో ఈ విస్తృత కార్యక్రమం నిర్వహించారు. కేవలం మహా నగరాలకే పరిమితం కాకుండా జమ్మూ కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, అండమాన్ వంటి సుదూర ప్రాంతాలు.. జార్ఖండ్, ఒడిశా, మధ్యప్రదేశ్‌లోని గ్రామీణ ప్రాంతాల వరకు ఈ ప్రచారం విస్తరించింది. పరిశోధనా వాతావరణాన్ని అంతకు ముందెన్నడూ ప్రత్యక్షంగా చూడని వేలాది మంది విద్యార్థులను ఐసీఎంఆర్-షైన్ బయోమెడికల్ పరిశోధన ప్రపంచంలోకి ఆహ్వానించింది. సంక్లిష్టమైన విజ్ఞానాన్ని సులభంగా, సరళంగా, సరదాగా అర్థం చేసుకునేలా ప్రచార వీడియోలు, పోస్టర్లు, కటౌట్లలో అధికారిక చిహ్నం డాక్టర్ క్యూరియో విద్యార్థులకు మార్గదర్శనం వహించింది.

ఈ కార్యక్రమంలో భాగంగా నాగ్‌పూర్, గోరఖ్‌పూర్‌లలో ఆత్యాధునిక సదుపాయాలు కలిగిన సంచార మొబైల్ బీఎస్ఎల్-3 ప్రయోగశాలలను విద్యార్థులు నేరుగా పరిశీలించారు. చక్రాలపై ఏర్పాటు చేసిన ఈ ప్రయోగశాలల ద్వారా అత్యంత భద్రతా ప్రమాణాలతో నిర్వహించే పరిశోధనలు క్షేత్రస్థాయిలోని పరిస్థితులకు నేరుగా ఎలా చేరువవుతున్నాయో వారు తెలుసుకున్నారు. ఇతర కేంద్రాల్లో యువ సందర్శకులు ఆసక్తికరమైన పోస్టరు ప్రదర్శనలు, ప్రత్యక్ష శాస్త్రీయ ప్రదర్శనలు, బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) లెక్కింపు, ప్రయోగశాల పరిశుభ్రతకు సంబంధించిన ప్రాయోగిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రోజువారీ ఆరోగ్య నిర్ణయాలు దేశవ్యాప్త ప్రజారోగ్యంతో ఎలా ముడిపడి ఉన్నాయో అవగాహన పొందారు. ఢిల్లీలో నీతి ఆయోగ్ ఆధ్వర్యంలోని అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ద్వారా అభివృద్ధి చేసిన సృజనాత్మక పరిష్కారాలను విద్యార్థులు ప్రదర్శించడంతో యువత ఆవిష్కరణ స్ఫూర్తి స్పష్టంగా కనిపించింది. గొప్ప శాస్త్రీయ ఆలోచనలకు వయోపరిమితి లేదని ఇది నిరూపించింది.

ఈ కార్యక్రమంలో భాగంగా ఐసీఎంఆర్ అధికారిక షైన్ వెబ్‌సైట్‌ను ప్రారంభించింది. ఇది విద్యార్థు లకు ఆరోగ్య పరిశోధనలకు సంబంధించిన వనరులు, కార్యక్రమ తాజా అప్‌డేట్‌లు, వివిధ అవకాశాలను పొందేందుకు వీలు కల్పిస్తుంది. దీనితో పాటు ఐసీఎంఆర్ జాతీయ స్థాయి షైన్ పాఠశాల పోటీలను కూడా ప్రకటించింది. నిజజీవితంలో ఎదురయ్యే ప్రజారోగ్య సవాళ్లను గుర్తించి, వాటిపై పరిశోధనాత్మక ప్రశ్నలను రూపొందించి, సంభావ్య పరిష్కారాలను ప్రతిపాదించాల్సిందిగా విద్యార్థులను ఈ పోటీ ఆహ్వానిస్తోంది. 'ఒక్క రోజు శాస్త్రవేత్తగా గడపడం' అనే ఆలోచనను మరో అడుగు ముందుకు తీసుకెళ్తూ.. తమ చుట్టూ ఉన్న ఆరోగ్య సమస్యలను శాస్త్రీయ దృక్పథంతో, ఆవిష్కరణల కోణంలో పరిశీలించేలా విద్యార్థులను ఈ పోటీ ప్రోత్సహిస్తుంది. ఆసక్తి గల విద్యార్థులు 2026 సెప్టెంబర్ 11వ తేదీ లోపు షైన్ వేదిక ద్వారా తమ దరఖాస్తులను సమర్పించవచ్చు.

ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా ఉన్న పాఠశాలల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. తరగతి గదులకు అతీతంగా విద్యార్థులకు శాస్త్రీయ పరిశోధనలు, ప్రయోగశాల పనులపై విలువైన అవగాహన కల్పించినందుకు ఉపాధ్యాయులు ఈ కార్యక్రమాన్ని స్వాగతించారు. ఇలాంటి కార్యక్రమాలను మరింత తరచుగా నిర్వహించాలని వారు సూచించారు. ఈ పాఠశాల పోటీ విద్యార్థులలో ఎనలేని ఉత్సాహాన్ని నింపింది. ఒక పాఠశాల అయితే తమ విద్యార్థులందరూ ఇందులో పాల్గొంటారని, వారు సమర్పించే ప్రాజెక్టులను పాఠశాల పరీక్షల్లో అంతర్గత మూల్యాంకనం కింద పరిగణిస్తామని ప్రకటించింది.

ఐసీఎంఆర్-షైన్ ద్వారా వేలాది మంది విద్యార్థులు కేవలం సైన్స్ గురించి చదువుకోవడం దాటి, దానిని కళ్లారా వీక్షించి, అనుభవించి, ప్రశ్నలు అడిగే స్థాయికి చేరుకున్నారు. సంప్రదాయ పరిశోధనా కేంద్రాలకే పరిమితం కాకుండా, దేశవ్యాప్త పాఠశాలలకు, క్షేత్రస్థాయి ప్రాంతాలకు పరిశోధనా అనుభవాలను తీసుకెళ్లడం ద్వారా యువ మేధావులు ఎక్కడ నివసిస్తున్నప్పటికీ సైన్స్‌ను ప్రత్యక్షంగా అనుభవించే అవకాశాలను ఈ కార్యక్రమం కల్పిస్తోంది. తద్వారా యువ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తూ, వారు సరికొత్త ఆవిష్కరణల వైపు అడుగులు వేసేలా, స్వస్థ్, వికసిత్ భారత్ నిర్మాణంలో తమ వంతు పాత్ర పోషించేలా భారత వైద్య పరిశోధన మండలి విశేష కృషి చేస్తోంది.

## కరాటే శిక్షకుడు వసంత్‌కుమార్‌కు సీపీ సత్కారం




కరీంనగర్, 14 (నేటినిజం ప్రతినిధి) మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'దీరా' కార్యక్రమాన్ని గురువారం తొర్రూర్ డివిజన్ మునగనూరులోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల ప్రాంగణంలో మల్కాజిగిరి కమిషనరేట్ పోలీస్ కమిషనర్ బి సుమతి ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలికలకు ఆత్మరక్షణ, క్రమశిక్షణ, మానసిక ధైర్యం, మార్షల్ ఆర్ట్స్ ద్వారా వ్యక్తిగత భద్రత వంటి అంశాలపై శిక్షణను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బాలికలకు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ అందిస్తున్న కరాటే శిక్షకుడు కె వసంత్‌కుమార్‌ను పోలీస్ కమిషనర్ సుమతి సన్మానించారు. బాలికల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు ఆపద సమయంలో తమను తాము రక్షించుకునే సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు దోహదపడతాయని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ డీసీబీ అనురాధ, మహిళా భద్రతా విభాగం ఉషారాణి, పలువురు ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు. కరాటే ఇన్‌స్ట్రక్టర్లు మొయిజ్, రాజశేఖర్, అనిల్, వీణ తదితరులు పాల్గొన్నట్లు కరాటే శిక్షకుడు కె వసంత్‌కుమార్ తెలిపారు.

## పోలవరం, వెలిగొండ ప్రాజెక్టు పనుల పురోగతిపై సీఎం సమీక్ష

అమరావతి, ఆగస్టు 14: పోలవరం, వెలిగొండ ప్రాజెక్టులకు సంబంధించి పనుల పురోగతి సహా వివిధ అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ప్రాధాన్య క్రమంలో పూర్తి చేయనున్న 36 ప్రాజెక్టులు, రాష్ట్రంలోని రిజర్వాయర్లలో నీటి నిల్వలు, నీటి విడుదల తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. లోటు వర్షపాతం, భూగర్భ జలాలు, తాగు నీటి సరఫరా, నిర్వహణా ప్రణాళిక, జలధార- జలహారతి కార్యక్రమాల అమలుపై సీఎం దిశానిర్దేశం చేశారు. పోలవరం ప్రాజెక్టులో నిన్నటి వరకూ 89.9 శాతం మేర సివిల్ పనులు పూర్తైనట్టు అధికారులు తెలిపారు.

పోలవరం ఎడమ కాలువ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి అవుతున్నట్టు సీఎంకు జలవనరుల శాఖ అధికారులు వెల్లడించారు. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్-1, గ్యాప్-2లో పనులు శరవేగంగా చేపట్టినట్టు తెలిపారు. డ్యామ్ సైట్ వద్ద రోడ్ల లాంటి మౌలిక వసతుల పనులు కూడా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు చంద్రబాబు సూచించారు. ప్రాజెక్టు సమీపంలోని గండి పోచమ్మ ఆలయాన్ని పరిరక్షిస్తూ స్థానికుల సెంటిమెంట్‌ను కాపాడేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. ఇటీవల కాలంలో 14 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహాలు వచ్చినా పనులకు ఇబ్బంది లేకుండా కొనసాగించినట్టు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి అధికారులు తెలియజేశారు. ఈ సమీక్షకు మంత్రి నిమ్మల రామానాయుడు, జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

రాచకొండ విశ్వనాథ శాస్త్రి
రంగులూ, ఫిరంగులూ
సంకలనం : ఏ.వి. రమణమూర్తి
పుస్తక పరిచయ సభ
సభాధ్యక్షత
నారాయణ వేణు మిత్రసాహితి
గౌరవ అతిథులు
డాక్టర్ వేమూరి కృష్ణమూర్తి
రాచకొండ ఉమాకుమార శాస్త్రి
పుస్తక పరిచయం
జి.ఎస్. చలం
సంకలనకర్త స్పందన
ఏ.వి. రమణమూర్తి
అందరూ ఆహ్వానితులే
నిర్వహణ
మిత్ర సాహితి
విశాఖపట్నం
అల్లూరి సీతారామరాజు
విజ్ఞాన కేంద్రం
డాబా గార్డెన్స్
విశాఖపట్నం
16.8.2026
ఆదివారం
ఉదయం

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.